http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

బుధవారం 20 మే 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన

# పూర్తి చేయండి

- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షా సమావేశం
- పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో భేటీ అయ్యారు. ఆ జిల్లా సాగునీటి ప్రాజెక్టు పనుల పురోగతిపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి ప్రజా ప్రతినిధులకు రేవంత్‌రెడ్డి కీలక సూచనలు చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి పూర్తి చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలన్నారు. నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని సీఎం భరోసా ఇచ్చారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని - మిగతా3లో



## 21 నుంచి సరస్వతి

# అంత్య పుష్కరాలు

- భక్తుల కోసం 3 వేలకు పైగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- రాష్ట్రవ్యాప్తంగా 3,360 వాహనాల ఏర్పాటు
- 'సరస్వతి' అంత్య పుష్కరాలకు రావాలని సీఎం, డీప్యూటీ సీఎంకు ఆహ్వానం
- భక్తులకు సేవలు అందించేందుకు 16 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు

హైదరాబాద్

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో జరగనున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వకుండా ఉండేందుకు ఆర్టీసీ ప్రత్యేక రవాణా ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ రీజనల్ మేనేజర్ భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. గోదావరి, ప్రాణహిత, సరస్వతి నదుల సంగమ స్థలమైన కాళేశ్వరంలో జరిగే పుష్కరాలకు ఈ నెల 21వ తేదీ నుంచి జూన్? 1 వరకు పలు ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 3,360 బస్సులతో 5,772 ప్రత్యేక ట్రిప్పులను నడిపేందుకు కొత్త ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాంతంలోని హనుమకొండ, వరంగల్-1, వరంగల్-2, పరకాల, నర్సంపేట, జనగామ, భూపాలపల్లి, తొర్రూరు, మహబూబాబాద్ డిపోల నుంచి కాళేశ్వరానికి 59 ప్రత్యేక బస్సులు నడుస్తాయని తెలిపారు. - మిగతా3లో

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

గరిష్ఠ వయో పరిమితి పెంపు

ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితి మరో ఏడాది పొడిగింపు

గరిష్ఠ వయోపరిమితిని 34 నుంచి 44 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ

ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితి 44 ఏళ్ల వరకు




హైదరాబాద్

తెలంగాణలో నిరుద్యోగ అభ్యర్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీసులకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ఠ వయో పరిమితిని పదేళ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేళ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తాజాగా జీవో జారీ చేసింది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో - మిగతా3లో

## భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు,

# ఎం777ఏ2 హోవిట్జర్లు

ప్రతిపాదనలకు అమెరికా గ్రీన్ సిగ్నల్

భారత్‌కు కీలక ఆయుధాలు, పరికరాల సరఫరాకు అమెరికా గ్రీన్ సిగ్నల్

అపాచీ సర్వీసుల డీల్ విలువ రూ.1,909 కోట్లు

హోవిట్జర్ నిర్వహణ మద్దతు అంచనా వ్యయం రూ.2,217 కోట్లు





## అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం

# నక్సలిజమే

- వారి త్యాగాల వల్లే మార్చి 31 కంటే ముందే నక్సలిజాన్ని నిర్మూలించాం
- బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణం
- అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమేనని వ్యాఖ్య

## రైతులను నిండా ముంచిన

# వర్షాలు

- కళ్ల ముందే తడిసిపోతున్నా కాపాడుకోలేని దైన్యం
- రైతులపాలిట శాపంగా మారిన అకాల వర్షాలు
- అకాల వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- పిడుగుపాటుకు ఓ రైతుకు చెందిన ఆవు మృతి
- కొనుగోలు కేంద్రంలో తూకం వేసి 100 బస్తాలు దగ్ధం



హైదరాబాద్

అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. కష్టపడి పండించిన పంట అంత తడిసిముద్దైంది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం కళ్ల ముందే తడిసిపోతుంటే కర్షకులు కన్నీరు మున్నీరుగా విలపించారు. తడిసిన ధాన్యాన్ని కొర్రీలు పెట్టకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని వేడుకుంటున్నారు. ద్రోణి, ఉపరితల చక్రవాత ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రంలో ఉరుములు-మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు - మిగతా3లో

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది

- శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని విమర్శ
- పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారు.



# అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే

భద్రతా బలగాల ధైర్యసాహసాలు, త్యాగాల వల్లే నిర్దేశిత గడువు 2026 మార్చి 31 కంటే ముందే దేశం నుంచి నక్సలిజాన్ని అంతం చేసినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో జరిగిన 26వ సెంట్రల్ రీజనల్ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. బస్తర్ నక్సల్స్ రహిత ప్రాంతంగా మారడం అందరికీ గర్వకారణమని అన్నారు. కేంద్రం చేపట్టిన నక్సల్స్ రహిత పోరాటానికి చాలా బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మద్దతు తెలిపాయని పేర్కొన్నారు. కానీ, ఛత్తీస్‌గఢ్‌లో గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తమకు కనీస సహకారం అందించలేదని ఆరోపించారు. 2023 డిసెంబరు 13న ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ సర్కార్ ఏర్పడిన వెంటనే బస్తర్‌లో మిగిలిన నక్సలైట్లను ఏరివేశామని అమిత్ షా తెలిపారు. బస్తర్ ప్రజలు ఇప్పుడు నిర్భయంగా జీవిస్తున్నారన్న ఆయన, ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన 'వీర్ గుండాధర్ సేవా డేరా' కార్యక్రమాన్ని కొనియాడారు. "బస్తర్ ప్రజల్లో ఇప్పుడు భవిష్యత్తు పట్ల ఆత్మవిశ్వాసం, భరోసా వాతావరణం కనిపిస్తోంది. భయానక వాతావరణం, తుపాకుల నీడలో బతకాల్సిన పరిస్థితులు ఇప్పుడు ముగిసిపోయాయి. ఎట్టకేలకు బస్తర్ స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకుంటోంది. బస్తర్ నక్సల్ రహిత ప్రాంతంగా మారడం మనందరికీ ఎంతో సంతోషకరమైన విషయం. 2024 ఆగస్టు 24న జరిగిన ఒక సమావేశంలోనే 2026 మార్చి 31 నాటికి దేశాన్ని నక్సలిజం నుంచి విముక్తి



చేస్తామని ప్రకటించాం. భద్రతా దళాల శౌర్యం, ధైర్యం, త్యాగాల ఫలితంగా మార్చి 31 గడువు తేదీకి ముందే నక్సలిజం పూర్తిగా నిర్మూలించాం. కాగా, 2023 డిసెంబర్ 13న విష్ణు దేవ్ సాయి నాయకత్వంలో ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడింది. అంతకుముందు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండేది. నక్సల్ రహిత ఉద్యమంలో బీజేపీయేతర ప్రభుత్వాలు చాలా వరకు మాకు మద్దతు ఇచ్చాయి, కానీ ఛత్తీస్‌గఢ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మాకు మద్దతు ఇవ్వలేదు."

**'అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే'**

"నక్సల్ బరి నుంచి నక్సలిజం విస్తరించడం మొదలైనప్పటి నుంచి దానికి మద్దతిచ్చే మేధావులు ఒక వాదన వినిపిస్తూ వస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అభివృద్ధి జరగనందు వల్లే నక్సలిజం ఉద్భవించిందని చెబుతున్నారు. కానీ అది నిజం కాదు. వెనక్కి తిరిగి చూస్తే అభివృద్ధి జరగకపోవడానికి అసలు కారణం నక్సలిజమే అని స్పష్టంగా అర్థమవుతుంది. దేశంలో నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల కంటే కూడా వెనుకబడిన ప్రాంతాలు చాలా ఉన్నాయి. కానీ అక్కడ నక్సలిజం పుట్టలేదు. ఆ ప్రాంతాలు క్రమంగా అభివృద్ధి చెందుతూ ముందుకు వెళు _న్నాయి. మన బస్తర్, ఇతర నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉండిపోయాయి." అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. "బస్తర్ ప్రాంతంతో సహా ఈ జిల్లా మొత్తాన్ని నక్సలిజం నుంచి విముక్తి చేయాలనే లక్ష్యంతో కేంద్ర హోం శాఖ ఇక్కడ సుమారు 200 భద్రతా శిబిరాలను ఏర్పాటు చేసింది. ఈ శిబిరాల్లోని జవాన్లు, ఐ=+, ఛత్తీస్‌గఢ్ పోలీసు సిబ్బంది ఆయా ప్రాంతాల భద్రతను పర్యవేక్షించేవారు. అయితే ఇప్పుడు బస్తర్ నక్సల్ రహితంగా మారింది. ఈ నేపథ్యంలోనే మొదటి దశలో భాగంగా అందులోని 70 శిబిరాలను 'వీర్ షహీద్ గుండాధర్ సేవా డేరా'లుగా మార్చాలని మేము నిర్ణయించాము." అని అమిత్ షా పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సోమవారమే ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో అమిత్ షా 'షహీద్ వీర్ గుండాధర్ సేవా డేరా జన సువిధా కేంద్రాన్ని' ప్రారంభించారు. ఈ సేవా కేంద్రం ద్వారా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు సంబంధించిన 371 పథకాల ప్రయోజనాలు ఒకే చోట ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

# భారత్‌కు అపాచీ హెలికాప్టర్లు, ఎం777ఏ2 హోవిట్జర్లు

భారత్ అమ్ములపొదిలో ఉన్న అపాచీ హెలికాప్టర్లు, హోవిట్జర్ ఫిరంగులకు నిర్వహణ, మద్దతుపరమైన సర్వీసులను అందించే ప్రతిపాదనలకు అమెరికా విదేశాంగ శాఖ ఆమోదం తెలిపింది. భారత్‌కు రూ.1,909 కోట్లు (198.2 మిలియన్ డాలర్లు) విలువైన అపాచీ హెలికాప్టర్ల పరికరాలు, సపోర్ట్ సర్వీసులను అందిస్తామని వెల్లడించింది. ఎం777ఏ2 అల్ట్రా లైట్ హోవిట్జర్ ఫిరంగుల నిర్వహణకు మద్దతును అందించే ప్రతిపాదనకూ అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీనికి సంబంధించిన అంచనా వ్యయం దాదాపు రూ.2,217 కోట్లు (230 మిలియన్ డాలర్లు). భారత్ వద్దనున్న అపాచీ హెలికాప్టర్ల సర్వీసింగ్‌కు బోయింగ్ కంపెనీ, లాక్‌హీడ్ మార్టిన్, హోవిట్జర్ ఫిరంగుల సర్వీసింగ్‌కు యూకేలోని క్యుంబ్రియాకు చెందిన బీఏఈ సిస్టమ్స్ కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది.

భారత్ మా ప్రధాన రక్షణ భాగస్వామి

**'అపాచీ హెలికాప్టర్ల ఇంజినీరింగ్, లాజిస్టిక్స్, సాంకేతిక డేటా, ప్రచురణలు, సిబ్బంది శిక్షణ,** సహాయక సేవలను తమకు అందించాలని భారత్ కోరింది. ఇందుకోసం అమెరికా ప్రభుత్వం, కాంట్రాక్టర్ల సహాయాన్ని అభ్యర్థించింది. దీంతోపాటు ఎం777ఏ2 అల్ట్రా లైట్ హోవిట్జర్ ఫిరంగుల దీర్ఘకాలిక నిర్వహణలోనూ సహాయాన్ని అందించాలని భారత్ విన్నవించింది. ఆ ఫిరంగుల అనుబంధ వస్తువులు, విడి భాగాలు, మరమ్మతు, శిక్షణ, సాంకేతిక సహాయం, లాజిస్టిక్స్ విభాగాల్లో సహకరించాలని భారత్ కోరింది. ఈ ప్రతిపాదనలకు మేం ఆమోదం తెలిపాం. అమెరికా–భారత వ్యూహాత్మక సంబంధాన్ని బలోపేతం చేసే లక్ష్యంతో ఈ సహకారాన్ని అందిస్తున్నాం. మేం భారత్‌ను ఇండో–పసిఫిక్, దక్షిణాసియా ప్రాంతాలలో రాజకీయ స్థిరత్వం, శాంతి, ఆర్థిక పురోగతికి దోహదపడే ప్రధాన రక్షణ భాగస్వామిగా భావిస్తున్నాం. దాని భద్రతను మెరుగుపర్చేందుకే ఈ సాయం చేస్తున్నాం. దీనివల్ల భవిష్యత్



ముప్పులను ఎదుర్కొనేలా భారత్ సామర్థ్యం ఇనుమడిస్తుంది. ప్రాంతీయ ముప్పులకు అడ్డుకట్ట పడుతుంది. భారత్‌కు ఈ సహాయక సేవలను అందిస్తున్న ఫలితంగా అమెరికా రక్షణ సంసిద్ధతపై ఎలాంటి ప్రతికూల ప్రభావం పడదు' అని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.

**భారత్ వద్ద ఎన్ని అపాచీలు ఉన్నాయి?**

భారత రక్షణ దళాల వద్ద మొత్తం 28 అత్యాధునిక అపాచీ హెలికాప్టర్లు ఉన్నాయి. వీటిలో 22 హెలికాప్టర్లు వాయుసేన వద్ద, 6 హెలికాప్టర్లు ఆర్మీ ఏవియేషన్ కార్ప్స్ వద్ద ఉన్నాయి. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థతో వేర్వేరు సమయాల్లో చేసుకున్న ఒప్పందాల ప్రకారం ఒక్కో హెలికాప్టర్ ధర మారుతూ వచ్చింది. తొలి 22 అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు 2015లో భారత్ – అమెరికా మధ్య ఒప్పందం కుదిరింది. అవన్నీ 2020 నాటికే డెలివరీ అయ్యాయి. వీటన్నింటిని వాయుసేనకే అందించారు. ఇక 2025 జులైలో 3 అపాచీ హెలికాప్టర్లు, 2025 డిసెంబరులో మరో 3 హెలికాప్టర్లను భారత్ కొనుగోలు చేసింది. వీటిని ఆర్మీకి అందజేసింది.

**అపాచీల ధర ఎంత ?**

22 అపాచీ హెలికాప్టర్ల కోసం 2015లో కుదిరిన ఒప్పందం ప్రకారం, భారత వాయుసేనకు ఒక్కో హెలికాప్టర్ సగటున రూ.678 కోట్లు పడింది. 2025 సంవత్సరం నాటికి ఈ హెలికాప్టర్ల రేట్లు గణనీయంగా పెరిగాయి. ఆ ఏడాది భారత్‌కు అమెరికా డెలివరీ చేసిన 6 అపాచీ హెలికాప్టర్ల మొత్తం విలువ దాదాపు రూ.4,168 కోట్లు (930 మిలియన్ డాలర్లు). అంటే ఒక్కో హెలికాప్టర్ ధర దాదాపు రూ.860 కోట్ల నుంచి రూ.948.5 కోట్లు ఉంటుంది. ఈ ఒప్పందంలో హెలికాప్టర్లే కాకుండా వాటి విడిభాగాలు, అత్యాధునిక లాంగ్‌బో రాడార్‌లు, హెల్‌ఫైర్ క్షిపణులు, ఆయుధ సామగ్రి, పైలట్ల శిక్షణ కూడా కలిసి ఉన్నాయి.

**చైనా బార్డర్‌లో హోవిట్జర్ ఫిరంగులు**

భారత సైన్యం వద్ద మొత్తం 145 ఎం777 అల్ట్రా లైట్ హోవిట్జర్ ఫిరంగులు ఉన్నాయి. వీటిలో 25 ఫిరంగులు నేరుగా అమెరికా/బ్రిటన్ నుంచి వచ్చాయి.మిగితా 120 ఫిరంగులను మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా భారతీయ సంస్థ మహీంద్రా డిఫెన్స్ మన దేశంలోనే అసెంబుల్ చేసింది. ఈ 145 ఫిరంగులతో భారత సైన్యం చైనా సరిహద్దుల్లో మొత్తం 7 ఆర్టిలరీ రెజిమెంట్లను ఏర్పాటు చేసింది. ఒక్కో హోవిట్జర్ ఫిరంగి ధర దాదాపు రూ.35 కోట్లు. వీటిని బ్రిటన్‌కు చెందిన బీఏఈ సిస్టమ్స్ సంస్థ తయారు చేస్తుంది. టైటానియం లోహంతో తయారు కావడం వల్ల వీటి బరువు కేవలం 4,200 కిలోలే. ఈ ఫిరంగులను వైమానిక దళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ల ద్వారా లడఖ్, అరుణాచల్ ప్రదేశ్ వంటి కనుమలు, ఎత్తైన హిమాలయ పర్వత ప్రాంతాలకు క్షణాల్లో తరలించొచ్చు. ఇవి 155 మిమీ క్యాలిబర్ బుల్లెట్లను ఉపయోగించి 24 నుంచి 30 కిలోమీటర్ల దూరంలోని శత్రువుల స్థావరాలను ఖచ్చితత్వంతో ధ్వంసం చేయగలవు.

# సెప్టెంబర్‌లో భారత్‌కు రష్యా అధ్యక్షుడు పుతిన్ రాక


రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఏడాది సెప్టెంబర్?లో భారత్‌కు రానున్నారు. 2026–బ్రిక్స్ సదస్సు కోసం సెప్టెంబర్ 12–13 తేదీల్లో పుతిన్ దిల్లీలో పర్యటించనున్నారు. ఈ మేరకు రష్యా ప్రభుత్వ కార్యాలయం క్రెమ్లిన్ అధికారికంగా ప్రకటించింది. అయితే, ఈ ఏడాది కాలంలో పుతిన్ భారత్‌కు రావడం ఇది రెండోసారి కావడం విశేషం. 2025 డిసెంబర్?లో జరిగిన 23వ భారత్, రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఇరుదేశాల సంబంధాల బలోపేతంపై ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపారు.

అలాగే, బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సమావేశం జరగనున్నట్లు క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకొవ్ తెలిపారు. కాగా, ఈసారి బ్రిక్స్ సదస్సుకు భారత్ నేతృత్వం వహిస్తోంది. ఈ సంవత్సరం భారతదేశ బ్రిక్స్ సదస్సుకు సంబంధించి దేశవ్యాప్తంగా అనేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో పుతిన్? భారత్?కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతేడాది బ్రిక్స్ సదస్సు బ్రెజిల్‌లోని రియో డి జనీరో నగరంలో జరిగింది.

**ప్రధాని మోదీతో భేటీ అయిన రష్యా విదేశాంగ మంత్రి**

ఇదిలా ఉండగా, ఇటీవలే రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ భారత్?లో పర్యటించారు. బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం, ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మే 14న జరిగిన ఆ సమావేశంలో భారత్– రష్యా ద్వైపాక్షిక సహకారం, అంతర్జాతీయ పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం, పశ్చిమాసియా పరిణామాలు వంటి కీలక విషయాల గురించి చర్చించారు.

అనంతరం దిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో సెర్గీ



లావ్రోవ్ మాట్లాడారు. చర్చల సందర్భంగా ప్రధాని మోదీ కూడా ఈ ఏడాది చివర్లో రష్యాలో పర్యటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు, వ్యూహాత్మక భాగస్వామ్య విస్తరణపై రెండు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. భారత్‌తో తమకు ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు మాస్కో కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. "బ్రిక్స్ సదస్సు కోసం మేం ఇప్పటికే సన్నాహాలు ప్రారంభించాం. ఈ ఏడాది రష్యా పర్యటన తన వంతు అని ప్రధాని మోదీ ధ్రువీకరించారు. అత్యున్నత స్థాయి సమావేశాల కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి" అని లావ్రోవ్ పేర్కొన్నారు.

ఇక, భారత్ అధ్యక్షతన జరగనున్న 2026 బ్రిక్స్ సదస్సుకు 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టైనబిలిటీ' అనే థీమ్‌ను నిర్ణయించారు. అంటే స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరత కోసం నిర్మాణం ప్రధాన లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. 2025లో బ్రెజిల్‌లోని రియో సమ్మిట్ సందర్భంగా ప్రధాని మోదీ ప్రస్తావించిన 'మానవతా దృక్పథం, ప్రజాకేంద్రిత అభివృద్ధి' భావజాలాన్నే ఈ థీమ్ ప్రతిబింబిస్తోందని బ్రిక్స్ అధికారిక వెబ్‌సైట్ పేర్కొంది.

**బ్రిక్స్‌లో ఎన్ని దేశాలు ఉన్నాయంటే!**

బ్రిక్స్ కూటమి విషయానికొస్తే, తొలుత బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా ఈ వేదికలో భాగమవగా, ఆ తర్వాత ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా సభ్యదేశాలుగా చేరాయి. దీంతో ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో మొత్తం సభ్యదేశాల సంఖ్య 11కు చేరింది. ప్రపంచంలోని 11 దేశాలను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా బ్రిక్స్? ఒక ప్రభావవంతమైన కూటమిగా అవతరించింది. ప్రపంచ, ప్రాంతీయ ప్రాముఖ్యత కలిగిన సమకాలీన సమస్యలు, అలాగే ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిపాలనకు సంబంధించిన అంశాలపై సంప్రదింపులు, సహకారం కోసం ఇది పనిచేస్తుంది.

## భారత్‌లో తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుంది



భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళుతున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. "భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్‌ల చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేం చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది, పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్– అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాలను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోదీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోదీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు."

**ప్రభుత్వాన్ని మార్చాలని ప్రజలకు రాహుల్ గాంధీ పిలుపు**

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

**'రైతులు నాశనమవుతారు– పేదలు తుడిచిపెట్టుకుపోతారు'**

"ప్రజలు మేల్కొని రాజకీయాలపై అవగాహన పెంచుకోవాలి. మీరు ఈ ప్రభుత్వాన్ని మార్చకపోతే ఈ దేశం మనుగడ సాగించదు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ రద్దు చేస్తారు. రైతులు నాశనమవుతారు. పేదలు తుడిచిపెట్టుకుపోతారు. కానీ మోదీ, అమిత్ షా సహా దేశ నాయకులందరూ అంబానీ ఇంట్లో జరిగిన పెళ్లికి హాజరవుతుంటారు. గతంలో ప్రజలు తమ ఇంటి పొదుపును తమ ఇళ్లలోనే ఉంచుకునేవారు. అయితే, ఇప్పుడు మోదీ ఆ డబ్బును మీ జేబుల నుంచి దోచుకుని అదానీ, అంబానీలకు, తన అనుచరులకు అప్పగించారు. వారు జీఎస్టీ పేరుతో నిధులను పక్కదారి పట్టిస్తున్నారు." అని రాహుల్ గాంధీ అన్నారు. రెండు రోజుల పర్యటన కోసం ఉత్తర్‌ప్రదేశ్‌కు వచ్చిన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలైన రాయ్‌బరేలీ, అమేఠీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. మంగళవారం ఉదయం లఖ్?నవూ విమానాశ్రయంలో దిగిన ఆయన, అక్కడి నుంచే నేరుగా తన నియోజకవర్గమైన రాయ్‌బరేలీ వెళ్లారు. విమానాశ్రయంలో రాహుల్ గాంధీకి ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్, ఇతర నేతలు స్వాగతం పలికారు.

## 'గోల్డ్ మానిటైజేషన్ వార్తలు అబద్ధం'

దేశవ్యాప్తంగా ఉన్న దేవాలయ ట్రస్టులు, మతపరమైన సంస్థల కోసం కేంద్ర ప్రభుత్వం 'గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్' తీసుకురావాలని యోచిస్తున్నట్లు వచ్చిన వార్తలను కేంద్రం కొట్టిపారేసింది. సదరు సోషల్ మీడియా పోస్టులు, నివేదికలు పూర్తిగా అబద్ధం అని, అవన్నీ తప్పుదోవ పట్టించేవి, ఆధారం లేనివి అని స్పష్టం చేసింది. దేవాలయాల వద్ద ఉన్న బంగారు నిల్వలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం గోల్డ్? బాండ్లను జారీ చేయాలని యోచిస్తోందని కొన్ని వార్తలు వచ్చాయి. ఇందుకోసం గోల్డ్ మానిటైజేషన్? (బంగారం నగదీకరణ)కు సంబంధించిన ప్రతిపాదనకు కేంద్రం ఆమోదం తెలిపిందని పేర్కొన్నాయి. అయితే అవన్నీ తప్పుడు కథనాలు అని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ మంగళవారం అధికారికంగా వెల్లడించింది. అలాగే దేవాలయ గోపురాలు, తలుపులు లేదా ఇతర దేవాలయ నిర్మాణాలపై అమర్చిన బంగారు పూతలను 'భారతదేశ వ్యూహాత్మక బంగారు నిల్వలు' (స్ట్రాటజిక్? గోల్డ్? రిజర్వ్స్? ఆఫ్ ఇండియా)గా పరిగణిస్తారనే వార్తలను కూడా తోసిపుచ్చింది. ఇలాంటి వదంతులను, ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరింది. ధ్రువీకరించని సమాచారాన్ని వ్యాప్తి చేయడం వల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడి, ప్రజలు తప్పుదోవన పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. విధానపరమైన నిర్ణయాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కోసం ప్రభుత్వ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలని సూచించింది. ప్రభుత్వం విధానపరమైన ప్రకటనలను అధికారిక పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్?), గవర్నమెంట్? వెబ్?సైట్లు, ధ్రువీకరించిన పబ్లిక్ కమ్యూనికేషన్? ప్లాట్?ఫారమ్?ల ద్వారా తెలియజేస్తుందని స్పష్టం చేసింది.

**ఇంతకీ గోల్డ్ మానిటైజేషన్ అంటే ఏమిటి?**

దేవాలయాల్లో ఉన్న బంగారాన్ని బ్యాంకింగ్ వ్యవస్థలోకి తెస్తారు. బంగారం విలువకు సరిపోయేలా గోల్డ్ బాండ్లు జారీ చేస్తారు. వాటిపై వడ్డీ రూపంలో ఆదాయం అందిస్తారు. సింపుల్?గా చెప్పాలంటే 'బంగారాన్ని అత్పాదక ఆస్తిగా మార్చడం' లేదా 'బంగారం నగదీకరణ' చేస్తారు.

దేవాలయాల్లో ఎంత బంగారం ఉంది?

భారతదేశంలో హిందూ దేవాలయాలు లేని ప్రాంతం లేదంటే అతిశయోక్తి కాదు. పూర్వం ఈ దేవాలయాలకు రాజులు, జమీందారులు మణులు, మాన్యాలు, బంగారు ఆభరణాలు ధారాళంగా విరాళాలు ఇచ్చేవారు. నేటి ఆధునిక కాలంలో ధనవంతులు భారీ ఎత్తున బంగారు అభరణాలు బహూకరించడం మనం వార్తల్లో చూస్తుంటాం. వీటికి తోడు సామాన్య భక్తులు ఇచ్చే కానుకలు కూడా భారీగానే ఉంటాయి. ఇవన్నీ దేవాలయానికి ఆదాయ వనరులుగా ఉంటాయి. అయితే అధికారికంగా ఎంత బంగారం ఉందో తెలియదుకానీ, వేల కిలోల బంగారం ఉంటుందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అయితే హిందూ దేవాలయాల్లోని బంగారాన్ని సాధారణంగా సక్రియ ఆస్తులు, అదనపు కానుకలుగా విభజిస్తారు. సక్రియ ఆస్తులు అంటే దేవుని మూలవిరాట్టు, ఉత్సవ మూర్తులకు అలంకరించే సంప్రదాయ ఆభరణాలు, గర్భగుడి తలుపులు, ధ్వజ స్తంభాలు, ఆలయ విమాన గోపురాలకు వేసే బంగారు పూతలు మొదలైనవి. వీటిని ఇతర కార్యాలకు ఉపయోగించరు. మళ్లీ కరిగించరు. ఇవి కాకుండా భక్తులు హుండీల్లో వేసే చిన్నచిన్న బంగారు ఆభరణాలు, నాణెములు, బంగారు కడ్డీలు మొదలైనవి ఉంటాయి. వీటిని అదనపు కానుకల కేటగిరీలోకి చేరుస్తారు. వీటిని నేరుగా పూజల్లో ఉపయోగించరు. కనుక వీటిని ఆలయ ట్రస్టులు భద్రత కారణాల దృష్ట్యా ఆర్థిక వ్యవస్థలోకి మళ్లిస్తాయి. సింపుల్?గా చెప్పాలంటే, ఈ బంగారాన్ని ప్రభుత్వ గుర్తింపు ఉన్న బ్యాంకు పథకాల్లో పెట్టుబడిగా పెడుతుంటాయి. వీటి వల్ల సదరు దేవాలయాలకు భారీగా ఆదాయం చేకూరుతుంది. కాగా,పెద్ద పెద్ద దేవాలయాలకు భారీ స్థాయిలో బంగారం కానుకల రూపంలో వస్తుంది. .

# రైతులను నిండా ముంచిన వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

వీచే అవకాశం ఉందని పేర్కొంది. వాతావరణ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రోజులు గడిచినా కొనుగోళ్లు జరగకపోవడంతో పలుచోట్ల మార్కెట్ యార్డుల్లోని ధాన్యం వర్షానికి తడిచిపోయిందని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

కేంద్రాల్లో తడిసి ముద్దయిన ధాన్యం

మెదక్ జిల్లాలో సోమవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలుచోట్ల ధాన్యం తడిచిపోయింది. కొల్చారం, హవేలీ ఘన్?పూర్ మండల కేంద్రాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. ఈదురు గాలులకు జోగిపేట మెదక్ ప్రధాన రహదారిపై భారీ వృక్షం నేలకొరిగింది. పిడుగుపాటుతో ఓ రైతుకు చెందిన ఆవు మృతి చెందింది. కామారెడ్డి జిల్లా తాండూరు, మాసంపల్లి, భవానిపేట, మంబాజీపేట గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం వర్షానికి తడిసిపోయింది. ఆదిలాబాద్ జిల్లాలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. గాలి వానకు కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దైంది.

రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే పద్మా దేవందర్ రెడ్డి విమర్శించారు. మెదక్ జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా రాయపోలు మండలం లింగారెడ్డిపల్లి కొనుగోలు కేంద్రం వద్ద హమాలీల కొరత, లారీల ఇబ్బందులపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. గజ్వేల్ - రామాయంపేట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నాకు దిగారు. మెదక్ మండలం పేరూర్ ఐకేపీ కేంద్రంలో తూకం వేసిన ధాన్యానికి గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఇద్దరు రైతులకు చెందిన సుమారు 100 బస్తాల ధాన్యం కాలిపోయింది. ఇప్పటికైనా



ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

"కేసీఆర్ హయాంలో పంట పండింది. నీళ్లు, రైతుబంధు ఇచ్చాం. పంట కొనుగోలు చేశాం. పైసలు వేశాం. చివరికి అకాల వర్షాలతో తడిసినా కూడా మెలకలు ఎత్తిన వాటిని కూడా కొన్నాం తప్ప ఈ రోజులాగా ఎవరినీ ఇబ్బంది పెట్టలేదు. ఈ ప్రభుత్వంలో మాత్రం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చాలా నష్టపోతున్నారు. అటు రైతుబంధు లేదు, ఇటు పంటకు కరెంట్? సరిగ్గా లేదు. పండిన పంట కొనే పరిస్థితి లేదు. వెంటనే అన్ని కేంద్రాలకు లారీలు పంపించాలి. పంటను కొనాలి"

**రైతులను నిండా ముంచిన వర్షాలు**

అకాల వర్షాలతో కల్లాల్లో ధ్యానం తడిచిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయకపోతే తమ కష్టం వృథాగా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం క్రితం కూడా వరంగల్? జిల్లా నర్సంపేట నియోజకవర్గంలో కురిసిన అకాల వర్షం రైతులను నిండా ముంచింది. పలు మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, మక్కలు తడిసి ముద్దయ్యాయి. టార్ఫాలిన్స్ కప్పినా ధాన్యాన్ని కాపాడుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

# గ్రేటర్ ఎన్నికలకు గులాబీ ప్లాన్

**హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, భాగ్యనగర రాజకీయం అప్పుడే వేడెక్కింది. జీహెచ్ఎంసీ పీఠంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా బీఆర్ఎస్ తన వ్యూహాలకు పదును పెడుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అధిక స్థానాలను సాధించి తన పట్టును నిరూపించుకున్న బీఆర్ఎస్, అదే జోష్‌తో మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా రంగంలోకి దిగి, ఓటర్ల జాబితా సవరణ నుంచి సభ్యత్వ నమోదు వరకు ప్రతి అంశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటూ కేడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, తమ పార్టీ సానుభూతిపరులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతు కాకుండా బీఆర్ఎస్ పకడ్బందీ చర్యలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులను పూర్తిగా అలర్ట్ చేసింది. ఈ నెల 25 నుంచి ఈ ప్రక్రియ రాష్ట్రంలో ప్రారంభం కానుండటంతో, ప్రతి డివిజన్, పోలింగ్ బూత్ పరిధిలో ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కేటీఆర్ ఆదేశించారు. అయితే, ఈ ప్రక్రియను మానిటరింగ్ చేసేందుకు బూత్ లెవెల్ ఏజెంట్ల లిస్ట్ ఇవ్వాలని అధిష్టానం ఆదేశించగా, మొత్తం 119 నియోజకవర్గాల్లో 38 నియోజకవర్గాల నుంచి ఇంకా లిస్ట్ అందకపోవడంపై ఇటీవల పార్టీ అధినేత కేసీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న కేటీఆర్.. గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలకు చెందిన ముఖ్య నేతలతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గులాబీ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, అర్హులైన ఓటర్ల వద్ద అవసరమైన అర్హత పత్రాలు ఉండేలా చూసే బాధ్యతను ఈ బీఎల్ఏలకు అప్పగించారు. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో బీఆర్ఎస్ అత్యధిక




స్థానాలను కైవసం చేసుకుంది. గతంలో వరుసగా రెండు సార్లు గ్రేటర్ మేయర్ పీఠాన్ని కూడా దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఈ జిల్లాల్లోని ఓటర్లు ఎక్కువగా ప్రభావితం అయ్యే అవకాశం ఉందని భావించి, ముస్లిం మైనారిటీ ఓటు బ్యాంకుపై పార్టీ ప్రత్యేక దృష్టి సారించింది. పాతబస్తీ మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో మైనారిటీలు బీఆర్ఎస్ వైపే నిలిచారు. అందుకే, తమ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోటా, లేని చోటా బూత్ ల వారీగా బీఎల్ఏలను నియమించి సానుకూల ఓట్లను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు వేచి చూడకుండా, ప్రజల్లోనే ఉండాలని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జీలను కేటీఆర్ ఆదేశించారు. గ్రేటర్ పరిధిలోని ప్రధాన సమస్యలైన డ్రైనేజీ వ్యవస్థ లోపాలు, తాగునీటి ఎద్దడి, దెబ్బతిన్న రోడ్లు, స్థానిక మౌలిక వసతుల కల్పనలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు? లాంటి వాటిని ఎండగడుతూ ప్రజల్లోకి వెళ్లాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ భవన్ వేదికగా కేటీఆర్ ఈ మొత్తం వ్యవహారాన్ని స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దీనితో పాటు, డిజిటల్ పద్ధతిలో ప్రతి ఇంటిని టచ్ చేస్తూ ముమ్మరంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందే వ్యూహాత్మక అడుగులు వేస్తూ, కేడర్‌లో జోష్ నింపుతున్న గులాబీ బాస్ ల చర్యలు గ్రేటర్ రాజకీయాల్లో సరికొత్త వేడిని పుట్టిస్తున్నాయి. రాబోయే మున్సిపల్ పోరులో గ్రేటర్ కోటపై మళ్లీ గులాబీ జెండా ఎగురుతుందో లేదో చూడాలి.

# రియల్ ఎస్టేట్ లో పుష్పరాజ్

**హైదరాబాద్ :** ఆయన ఒకప్పుడు కలెక్టర్ గా పని చేశారు. తన తెలివితేటలతో భారీగా భూములు సంపాదించారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతంలో విపరీతంగా భూములు కొన్నారు. ఆ భూములు ఇప్పుడు వేలకోట్ల ఆస్తులు అయ్యాయి. కలెక్టర్ గా ఉన్నప్పుడు ఇప్పటి ముఖ్యమంత్రికి ఆయన పాదాభివందనం కూడా చేశారు. కలెక్టర్ ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఓ రాజకీయ పార్టీలో చేరారు. ఇప్పుడు ఏకంగా ఎమ్మెల్సీగా పనిచేస్తున్నారు. ఇప్పుడు ఆయన చేతిలో ఎన్నో కీలకమైన ప్రాజెక్టులు ఉన్నాయి. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ దగ్గర ఉన్న ఓ కాస్ట్లీ ప్రాంతంలో ఎకరం భూమిని ఆయన ఏకంగా 100 కోట్లు పెట్టి కొన్నారు. ఇటువంటి కోట్లు ఆయనకు లెక్క కావు. లెక్కలోకి కూడా రావు. ఇప్పుడు ఏకంగా ఆయన దాదాపు పదికి మించిన ప్రాజెక్టులను చేతుల్లో పెట్టుకున్నారు. తెల్లాపూర్ ప్రాంతంలో 13 ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 1500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇదే తెల్లాపూర్లో మరో చోట 24 ఎకరాల్లో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇందులో ఏకంగా మూడు వేల ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి. తెల్లాపూర్ ప్రాంతంలో 21 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో కూడా 3500 ప్లాట్లు అందుబాటులో ఉన్నాయి.



తెల్లాపూర్ ప్రాంతంలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో అపార్ట్మెంట్ నిర్మించారు. ఇందులో 500 ప్లాట్లు అందుబాటులో వచ్చాయి. హైదరాబాద్ నగరంలో అత్యంత ఖరీదైన నియోపోలీస్ ఏరియాలో ఏడు ఎకరాలలో బహుళ అంతస్తులు నిర్మించారు. ఇదే ఏరియాలో 8 ఎకరాల విస్తీర్ణంలో 600 ప్లాట్లు నిర్మించారు. నార్సింగి, మంచిరేవుల, కోకాపేట, అత్తాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలలో దాదాపు ఐదువేల ప్లాట్ల విస్తీర్ణంతో బహుళ అంతస్తులను నిర్మించారు. ఒక రకంగా తెలంగాణ రియల్ ఎస్టేట్లో ఒకప్పుడు ఆపర్ణ, మై హోమ్, జనప్రియ వంటి కంపెనీలు నెంబర్ వన్ స్థానంలో ఉండేవి. కానీ ఆ కంపెనీలను ఈ మాజీ కలెక్టర్ కంపెనీ దాటేసింది. హైదరాబాదులోనే దాదాపు పదివేల ప్లాట్ లకు మించిన సామర్థ్యంతో బహుళ అంతస్తులు నిర్మిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే భారీగా భూములను కొనేసింది. ఈ ప్రకారం చూసుకుంటే ఆ మాజీ కలెక్టర్ రియల్ ఎస్టేట్ బిజినెస్ లో పుష్ప రాజ్ లాగా అవతరించే అవకాశం ఉందని బిజినెస్ ఎక్స్పర్ట్స్ చెప్తున్నారు. ఆయన ఒక పార్టీ నుంచి ఎమ్మెల్సీగా గెలిచినప్పటికీ.. ఇప్పుడు అధికార పార్టీతో దగ్గరగా ఉంటున్నట్టు తెలుస్తోంది. పైగా అధికార పార్టీలో ఒక కీలక నాయకుడితో ఇటీవల బంధుత్వం కూడా పెంచుకున్నారని సమాచారం. అందువల్లే ఈ స్థాయిలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో దూకుడు కొనసాగిస్తున్నారని.. వేల కోట్లను సులభంగా సంపాదిస్తున్నారని టాక్ వినిపిస్తోంది. ఏది ఏమైనప్పటికీ ఏ ఎండకు ఆ గొడుగు పట్టడంలో ఈ మాజీ కలెక్టర్ సిద్ధహస్తుడని మార్కెట్ వర్గాలు చెవులు కోరుకుంటున్నాయి. చూడాలి మరి ఈ మాజీ కలెక్టర్ ఇంకా ఏ స్థాయిలో దూసుకుపోతారో.. ఇంకా ఏ రేంజ్ లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ను తన చేతుల్లో పెట్టుకుంటారో..

## తెలంగాణ నిరుద్యోగ అభ్యర్థులకు గుడ్‌న్యూస్

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తుకు గరిష్ఠ వయో పరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచటాన్ని హర్షిస్తూ మంగళవారం ఓయూలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిరుద్యోగ జేఏసీ డాక్టర్ కోటూరి మానవతారాయ్ నేతృత్వంలో నిరుద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మానవతారాయ్ మాట్లాడుతూ న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా సుమారు 40 వేల ఉద్యోగాల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. కొంతమంది వారి రాజకీయ ప్రయోజనాల కోసం, ఆర్థిక ప్రయోజనాల కోసం కృత్రిమ నిరుద్యోగ నాయకుల అవతారమెత్తారని, వారి ఉచ్చులో నిజమైన నిరుద్యోగులు పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు కొప్పుల ప్రతాప్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు రాథోడ్ రవీంద్ర నాయక్, నిరుద్యోగ జెఏసీ నాయకులు జగన్నాథ్ యాదవ్, అశోక్, హేమంత్ చౌదరి, నాగార్జున, దేవ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి

-మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘారెడ్డి, రాకేశ్? రెడ్డి, వంశీ కృష్ణ, వీర్లపల్లి శంకర్, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు హాజరయ్యారు.

మా ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారు

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు 90 శాతం పూర్తి చేశామని బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శించారు. రెండేళ్లలో పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేస్తానని ఆనాడు కేసీఆర్ చెప్పి రూ.లక్ష కోట్ల ప్రాజెక్టుపై రూ.25 కోట్లే ఖర్చు పెట్టారని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్ సాగర్ కాంగ్రెస్ హయాంలో వచ్చినవేనని గుర్తు చేశారు. కాళేశ్వరం పూర్తి చేసినట్లు పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదని అని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డికి కావాల్సిన 90 టీఎంసీలు బీఆర్ఎస్ తేలేకపోయిందని, తాము తెచ్చి తీరుతామని అన్నారు. పాలమూరుపై బీఆర్ఎస్‌ది సవతి తల్లి ప్రేమ అని అన్నారు. సమీక్ష అనంతరం ఈ మేరకు మాట్లాడారు.

సమావేశంలో మంత్రులు

పాలమూరు-రంగారెడ్డి పూర్తి కావాలంటే రూ.లక్ష కోట్లు కావొచ్చని జూపల్లి పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల లభ్యత దృష్ట్యా గ్రావిటీ ద్వారా నీళ్లు తేవచ్చని, పాలమూరు-రంగారెడ్డికి 90 టీఎంసీల నికర జలాలు సాధించి తీరుతామని తెలిపారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటాను బీఆర్ఎస్ ప్రభుత్వం తాకట్టు పెట్టిందన్న ఆయన, కృష్ణా జలాల్లో తెలంగాణకు 62 శాతం వాటాపై హక్కు ఉందని స్పష్టం చేశారు. పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ, వేల టీఎంసీలు తీసుకెళ్లిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డికి త్వరలోనే నీటి కేటాయింపులు సాధిస్తామని, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎంను కలిశామని చెప్పారు. పాలమూరుకు అధిక నిధులు కేటాయించాలని సీఎంను కోరామన్న ఆయన, ప్రాజెక్టుల పూర్తికి అధిక నిధులు కేటాయించేలా ఒత్తిడి తెస్తామన్నారు.

## 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

-మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రధానమైన హనుమకొండ బస్టాండు నుంచి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు. అయితే ఈ పుష్కరాల సమయంలో వివిధ ప్రాంతాల నుంచి నడిచే ఆర్టీసీ ప్రత్యేక బస్సులకు సాధారణ రోజుల్లో ఛార్జీ కన్నా 50 శాతం అధికంగా వసూలు చేస్తారని వారు అన్నారు. మహాలక్ష్మి ప్రయాణికులకు యథావిధిగా ఉచిత ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు.

**సీఎం, డీప్యూటీ సీఎంకు ఆహ్వానం**

మహదేవపూర్? మండలం కాళేశ్వరంలో ఈ నెల 21న ప్రారంభం కానున్న సరస్వతీ నది అంత్య పుష్కరాలకు హాజరు కావాలంటూ సీఎం రేవంత్ ?రెడ్డి, భట్టి విక్రమార్కను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ డైరెక్టర్ హనుమంతరావు ఆహ్వానించారు.

**30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం**

కాళేశ్వరం పుష్కారలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా, రద్దీకి అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మంత్రి కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్?బాబు పేర్కొన్నారు. పుష్కారాలకు సంబంధించి ఏర్పాట్లపై సీఎస్? కె.రామకృష్ణా రావు ఆధ్వర్యంలో సచివాలయంలో ఇటీవల ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ ?బాబు మాట్లాడుతూ ఈ నెల 21న ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి పుణ్యస్నానం ఆచరించి అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి పుష్కరాలకు దాదాపు 30-40 లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు.

**భక్తుల కోసం మౌలిక సౌకర్యాలు ఏర్పాటు**

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారని పేర్కొన్నారు. ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఇవన్నీ జూన్? 1న ముగియనున్న పుష్కరాలకు విస్తృతమైన మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశామని సీఎస్? పేర్కొన్నారు. ఈ పుష్కరాల్లో భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, శానిటేషన్, ట్రాఫిక్, రవాణాను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, డైరెక్టర్ హనుమంతరావు, వివిధ శాఖల ఉన్నతాధికారులు నవీన్ మిత్తల్, ముకుంద్‌రెడ్డి, అనితా రామచంద్రన్, హరీశ్, చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు.

**పుష్కరాల్లో భక్తుల ఆరోగ్యమస్తు!**

అంతేకాకుండా కాళేశ్వరం త్రివేణి సంగం పుష్కరాల్లో భక్తులకు సేవలు అందించేందుకు వైద్యశాఖ ప్రణాళిక రూపొందించింది. ఈ 12 రోజుల పాటు సాగే ఈ మహా వేడుకలను లక్షల్లో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కొత్త కార్యచరణ చేసింది. అక్కడికి వచ్చిన వారు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేలా 16 వైద్య శిబిరాలు, 576 మంది సుశిక్షితులైన సిబ్బంది, 18 మంది ప్రత్యేక వైద్య నిపుణులను రంగంలోని దింపనుంది. మొత్తం 16 చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఘాట్? ప్రధాన క్యాంప్?, కాళేశ్వరం పీహెచ్?సీ ప్రధాన క్యాంప్?, పాత ఈవో కార్యాలయం, దేవాలయ ప్రధాన ద్వారం, పార్కింగ్? ఏరియా-1, టెంట్? సిటీ, పార్కింగ్? ఏరియా-2, తాత్కాలిక బస్టాండ్?, పాత బస్టాండ్?, గోదావరి ప్రధాన ఘాట్?, హరిత హోటల్?, సరస్వతీ ఘాట్? నదీ తీరం, గంగారపు క్రాస్? రోడ్?, అన్నారం కెనాల్?, కాటారం పీహెచ్?సీ ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలో పారామెడికల్? సిబ్బందికి బస, మందుల భద్రతకు స్టోరేజ్? గదులు కేటాయించారు.

## పారిశ్రామిక వాడలో అగ్నిప్రమాదం.. పేలిన రియాక్టర్లు

**హైదరాబాద్:** మేడ్చల్ పారిశ్రామిక వాడలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కెమికల్ ఫ్యాక్టరీలో రియాక్టర్లు పేలడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో చుట్టుప్రక్కల ప్రాంతాలకు దట్టమైన పొగ వ్యాపించింది. వివరాలు తెలుసుకున్న అగ్నిమాపక



సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకున్నారు. రెండు ఫైరింజన్లతో మంటలు ఆర్పుతున్నారు. అయితే ఈ ప్రమాదంలో జరిగిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో అక్కడి స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

## సంపాదకీయం

# కేసీఆర్-జగన్-విజయ్ రీజనల్ ఫ్రంట్

ఒక తాజా ముఖ్యమంత్రితో చేతులు కలిపి ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు తమ రాజకీయ పునరుత్తేజం పొందాలని చూస్తున్నారా. ఏకంగా సౌత్‌లో రీజనల్ రెలిజియన్ ఫ్రంట్ కి శ్రీకారం చుట్టాలని భావిస్తున్నారా అంటే జరుగుతున్న ప్రచారం బట్టి చూస్తే అవును అనే మాట వస్తోంది. ఆ పార్టీలు బీఆర్ఎస్, వైసీపీ టీవీకే అయితే అధినాయకులు కేసీఆర్ జగన్ విజయ్ అని అంటున్నారు. ఇందులో కేసీఆర్ రెండు సార్లు తెలంగాణాకు సీఎం గా చేసి ఓటమి పాలు అయ్యారు. ఏపీలో ఒకసారి అధికారంలోకి వచ్చిన జగన్ కూడా రెండేళ్ళుగా మాజీ సీఎం గా ఉన్నారు. ఇక రెండేళ్ళ క్రితం పార్టీ పెట్టి తాజాగా తమిళనాడు ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన విజయ్ ఇపుడు కేసీఆర్ జగన్ భవిష్యత్తు రాజకీయాకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తున్నారు అని అంటున్నారుతెలుగు రాజకీయాల్లో కొత్త సమీకరణలకు ప్రధాని నరేంద్ర మోడీ తాజా పర్యటన దారి తీసింది. ఇక్కడ ఒక విషయం ఫుల్ క్లారిటీ వచ్చింది. ఎన్డీయే బంధం మరింత పటిష్టం అయింది అని. పైగా టీడీపీ బీజేపీ జనసేన 2029 లో కూడా కలసికట్టుగా సాగుతాయని అర్ధం అవుతోంది. అంతే కాదు ఈ మోడీ బాబు పవన్ ల మధ్య మిత్ర బంధం మరింత బలీయం అయింది. దాంతో వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణాలో బీఆర్ఎస్ తో బీజేపీ కలుస్తుందన్న ప్రచారం పూర్తిగా పక్కకు పోయింది. అలాగే ఏపీలో వైసీపీతో ఏదో నాటికి బీజేపీ స్నేహ హస్తం గట్టిగా అందిస్తుందన్న అశలూ అడుగంటాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్డీయేకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి వైసీపీకి అనివార్యంగా కనిపిస్తోంది. ఇంత జరిగిన తరువాత కూడా ఎన్డీయేకు మద్దతు పరోక్షంగా అయినా ఇస్తూ పోతే అది పార్టీ జనంలో బయట జనంలో తప్పుడు సంకేతాలు ఇచ్చే చాన్స్ ఉంటుంది. వాటికి మించి వైసీపీకి బలంగా ఒక్క మైనారిటీ ఎస్సీ ఎస్టీ ఓటు బ్యాంక్ కూడా రివర్స్ అవుతుందన్న చర్చ కూడా ఉందని అంటున్నారు. ఇక ఏపీలో 2029 ఎన్నికల్లో బాబు పవన్ మోడీల త్రిమూర్తులను వైసీపీ అధినేత జగన్ మరోసారి ఎదుర్కోవాల్సిన పరిస్థితి అయితే ఉంది. దాంతో వైసీపీ ఇక మూడేళ్ళు ముందుగానే తన రాజకీయ యాక్షన్ ప్లాన్ ని రెడీ చేసుకోవాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు. తెలంగాణాలో కేసీఆర్ విషయం తీసుకుంటే కాంగ్రెస్ అక్కడ స్థానికంగా అధికారంలో ఉంది. దాంతో జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తో నేరుగా చేతులు కలపలేని పరిస్థితి ఉంది. అలాగని బీజేపీతో కలసి ముందుకు సాగే సీన్ కూడా లేదు, బీజేపీతో బాహాటంగా కలిస్తే మైనారిటీ ఓట్లు ఇతర అణగారిన వర్గాల ఓట్లు పోతాయన్న భయం ఉంది. అయితే బీజేపీ పట్ల ఎంతో కొంత సాఫ్ట్ కార్నర్ తో అయితే బీఆర్ఎస్ ఉందన్న ప్రచారాన్ని కాంగ్రెస్ వర్గాలు ఇంతకాలం చేస్తూ వచ్చాయి. అందులో నిజమెంత ఉందో తెలియదు కానీ ఇపుడు మాత్రం మోడీ బాబు పవన్ తెలంగాణాలో కూడా ఎన్డీయే గా ముందుకు వస్తే మాత్రం బీఆర్ఎస్ కొత్త ఆలోచనలు చేయాల్సిందే అన్నది కూడా గులాబీ పార్టీలో ఉంది: ఇదిలా ఉంటే జాతీయ స్థాయిలో ఇండియా కూటమి వైపు కేసీఆర్ జగన్ చూపు పడుతోందా అన్న చర్చ కూడా ఉంది. ఎంత లేదనుకున్నా కాదనుకున్నా జాతీయ రాజకీయాన్ని కూడా గమనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. అంతే కాదు తెలంగాణాలో ఏకంగా మోడీయే రంగంలోకి దిగితే ప్రాంతీయ పార్టీలతో అయినా చెలిమి చేయడం ద్వారా బలం పెంచుకోవాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా ఉంది అని అంటున్నారు. దాంతోనే తమిళనాడు కొత్త ముఖ్యమంత్రి టీవీకే అధినేత విజయ్ తో స్నేహం నెరిపే విషయంలో బీఆర్ఎస్ ఉత్సాహం చూపిస్తోంది అని అంటున్నారు. అదే సమయంలో వైసీపీ అధినేత జగన్ కూడా విజయ్ తో చెలిమి చేస్తున్నారు. ఇలా రెండు తెలుగు రాష్ట్రాలలో రెండు కీలక పార్టీలు ఇపుడు జాతీయ రాజకీయాల్లో కొత్త రూట్ లోకి వెళ్తున్నాయా అన్న చర్చ సాగుతోంది. నిజానికి ఈ రోజున దేశ రాజకీయాలలో ప్రాంతీయ పార్టీలు తమ వంతు పాత్ర పోషిస్తున్నాయి. ఎన్డీయేలో జనసేన టీడీపీ ఉంటే మరి కొన్ని పార్టీలు కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమిలో ఉన్నాయి. అయితే ఈ రెండు కూటములలో లేని ఉండలేని ప్రాంతీయ పార్టీలుగా తెలుగు నాట బీఆర్ఎస్ వైసీపీలను చెప్పుకోవాలి. ఈ రెండు పార్టీలకు కాంగ్రెస్ రాజకీయ ప్రత్యర్ధి. దాంతో ఇండియా కూటమిలోకి కలవలేరు, అలాగే ఎన్డీయే నాయకత్వంలోని కూటమిలో కూడా చేరలేరు. దాంతో తమకు తాముగా దక్షిణాదిన ఒక ప్రాంతీయ కూటమిని ఏర్పాటు చేసుకుంటే రేపటి రోజున అంటే 2029 ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని కేంద్రంలో ఏర్పాటు చేయడానికి అవసరమైన సీట్లు రాకపోతే తమ బలం అవసరం అవుతుందని అలా తమకు డిమాండ్ ఉంటుందని ఒక కొత్త ప్రయత్నానికి సిద్ధపడుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక తమిళనాడులో విజయ్ పార్టీ గెలవడం ఏంటి అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ కూడా పెద్ద ఎత్తున రియాక్ట్ అయిపోయాయి. అంతే కాదు విజయ్ కి కంగ్రాట్స్ చేస్తూ చెలిమికి తెర తీశాయి. ఇక్కడ వైసీపీకి టీవీకేకి సిద్ధాంతపరంగా సారూప్యం కంటే రెండు పార్టీలకూ క్రిస్టియన్ మైనారిటీ ఓటు బేస్ మాత్రం ఒక కామన్ పాయింట్ గా చెబుతున్నారు. ఇక సంక్షేమ పథకాలు ఇతర అంశాలలో జగన్ స్ట్రాటజీని విజయ్ ఫాలో అవుతున్నారని కూడా అంటున్నారు. ఇవన్నీ పక్కన పెడితే ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లతో కూడిన బీజేపీ కూటమిని ఢీ కొట్టాలంటే ఈ సఖ్యత కొత్త కూటమి అవసరం అని వైసీపీ భావిస్తూంటే తెలంగాణాలో కూడా దూసుకుని వస్తున్న బీజేపీని ఎన్డీయే కూటమి ఏర్పాటుని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ కూడా విజయ్ వంటి మిత్రుడి వైపు చూస్తోంది అని అంటున్నారు. ఇది కేసీఆర్ కి జగన్ కి రాజకీయ అనివార్యంగా కనిపిస్తుంది అని అంటున్నారు. ఏపీలో చూస్తే పార్టీగా వైసీపీని పెట్టక ముందు నుంచే జగన్ మీద అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఆయన మీద సీబీఐ కేసులు పదహారు నెలల జైలు జీవితం ఇవన్నీ ఒక ఎత్తు అయితే 2019 నుంచి 2024 దాకా సాగిన అయిదేళ్ల వైసీపీ ఏలుబడిలో అవినీతి మరో ఎత్తు అని అంటున్నారు. దాని వల్లనే వైసీపీ 2024 లో ఓటమి పాలు అయిందని చెబుతారు. ఒక బీఆర్ఎస్ విషయం తీసుకుంటే ఆ పార్టీ తెలంగాణాలో చేసిన పదేళ్ల పాలనలో కాళేశ్వరం నుండి ఫార్ములా వన్ కార్ రేసింగ్ వరకు భారీ త్తున ఆరోపణలు ఈ రోజుకీ సంచలనంగానే ఉన్నాయని చెబుతున్నారు. మరో వైపు తమిళనాడులో అనూహ్యంగా అధికారంలోకి వచ్చిన టీవీకే పార్టీ మీద కూడా అవినీతి మరకలు ఆరంభంలోనే ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అదెలా అంటే టీవీకేలో ఆ పార్టీ కీలక నేత, మంత్రి అధర్వ అర్జున్ తండ్రి లాటరీ కింగ్ అని చెబుతున్నారు. కూటమి సాధ్యమా : అయితే ఈ ముగ్గురు నాయకులూ తమ ప్రభావాన్ని రాజకీయంగా దక్షిణాదిన చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. దాని కోసం ప్రాంతీయ కూటమిని కట్టాలని కూడా వ్యూహ రచన చేస్తున్నట్లుగా ప్రచారం అయితే ఉంది. కానీ అవినీతి ఆరోపణలు ఒక వైపు మరో వైపు మత రాజకీయాలను ముందుకు తీసుకుని రావడం వంటివే అడ్డంకిగా మారుతాయా అన్న చర్చ సాగుతోంది. అయితే దక్షిణాదిన ఎన్డీయే కూటమిని మరీ ముఖ్యంగా చంద్రబాబుకు ముకు తాడు వేయాలని ఈ కూటమి పెద్దల ప్రధాన లక్ష్యమని అంటున్నారు. మరి వీరి ఆశలు ఏ మేరకు సఫలీకృతం అవుతాయన్నది తెలియాలన్నా అనేక ప్రశ్నలకు జవాబు దొరకాలన్నా కొంత కాలం పాటు వేచి చూడాల్సి ఉందని అంటున్నారు. మరో వైపు చూస్తే ఇండియా కూటమిలో కాంగ్రెస్ సారధ్యం కాకుండా ఏ మమతా బెనర్జీ లాంటి వారో పగ్గాలు అందుకుంటే తెలుగు నాట కూడా కొత్త పార్టీలు అందులో చేరేందుకు వీలు ఉంటుందని అంటున్నారు. మొత్తానికి ఎన్డీయే తెలుగు రాష్ట్రాలలో బలంగా ఉండాలని మోడీ నిర్ణయించిన నేపథ్యంలో అటు బీఆర్ఎస్ ఇటు వైసీపీ రెండూ అలెర్ట్ అయినట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

# ప్రజాస్వామ్యమా, రాజకీయ మాయా?




ప్రపంచ రాజకీయ చరిత్రలో 'ప్రజాస్వామ్యం' అనే పదానికి వచ్చినంత పవిత్రత మరే రాజకీయ సిద్ధాంతానికీ రాలేదు. వర్తమాన ప్రపంచంలో ప్రతి ప్రభుత్వం తనను 'ప్రజాస్వామ్య' ప్రభుత్వంగానే ప్రకటించుకుంటోంది. ప్రతి యుద్ధం, ప్రతి ఆర్థిక విధానం, ప్రతి చట్టం-- ప్రజాస్వామ్యం పేరుతోనే సాగుతున్నాయి. ఇరాన్ మీద యుద్ధానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాడిన రాజకీయ ఆయుధం 'పాలనమార్పు' (=వస్త్రఅఎవ ఎఘ్నుఅస్త్రవ). అంటే, ఇరాన్‌లో నియంతృత్వాన్ని అంతంచేసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతామని నమ్మబలికాడు. ఆ మంత్రం ప్రభావవంతంగా పనిచేసింది. ఆ దెబ్బకు ఇరాన్ మీద అమెరికా--ఇజ్రాయెల్‌ల జంటదాడిని ఖండించడానికి కూడ అనేక దేశాలు జంకాయి. ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామంటే హజార్ ఖూన్ మాఫ్! కానీ, అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఇక్కడే ఎదురవుతుంది. ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల పాలనేనా? లేక ప్రజల పేరుతో నడిచే ఇతరుల అధికార వ్యవస్థనా? మార్క్సిస్టులకు సాంప్రదాయంగా ప్రజాస్వామ్యం మీద ఎలాగూ నమ్మకం వుండదు. పెట్టుబడీదారీ వ్యవస్థ తనకు అనుకూల మైన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రూపొందిం చుకుందన్నారు కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఏంగిల్స్ ముక్తకంఠం తో. అంచేత వాళ్ళ మీద ప్రజాస్వామ్య మంత్రం ప్రభావం చూపదు. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత, ముఖ్యంగా ముసోలినీ – హిట్లర్ల ఫాసిస్టు, నాజీయిస్టు నియంతృత్వాల ను చూసిన తరువాత ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం మీద వ్యామోహం ప్రమాదకరంగా పెరిగింది. ఈ 'పవిత్ర మాయా జాలా'న్ని ఛేధించడానికి ప్రయత్నించినవాళ్లలో ప్రముఖ రాజనీతి శాస్త్రజ్ఞుడు జాన్ డన్న్ ఒకడు. 'ప్రజాస్వామ్యపు మాయజాలం ఛేదింపు' అనే పుస్తకంలో అనేక దేశాల్లో క్రూరమైన నియంతృత్వమే ప్రజాస్వామ్యం ముసుగులో కొనసాగుతున్న తీరును అతను విశ్లేషించాడు. అనేక దేశాల్లో క్రమం తప్పకుండా ఎన్నికలు జరుగుతున్నాయి. చట్టసభలు నడుస్తున్నాయి. అనేక చట్టాలు మెజారిటీ సభ్యుల ఆమోదం పొందుతున్నాయి. ప్రతిపక్షాలు కూడా సభలు సమావేశాలు నిర్వహించి తమ విధానాలను ప్రకటిస్తున్నాయి, అధికార పార్టీలను ఘాటుగా విమర్శిస్తున్నాయి. ఎన్నికల్లో కొన్నిచోట్ల అధికార పార్టీ ఓటమిపాలై ప్రతిపక్ష పార్టీ అధికారాన్ని చేపడుతోంది. ఇన్ని జరిగినా, ప్రజాస్వామ్యానికి నిఘంటువుల్లో అర్థం చెప్పినట్టు సమాజంలో జరుగుతోందా? తమ జీవితాల ను తాము అనుకున్నట్టు మార్చుకునే అధికారం నిజంగా ప్రజల చేతుల్లో ఉంటోందా? జాన్ డన్న్ వాదన ప్రకారం ప్రజాస్వామ్యం ఇప్పుడు ఒక రాజకీయ మత్తుమందుగా మారిపోయింది. ఎన్నికలు జరుగుతున్నాయనే కారణంతో ప్రజలు తమకు అధికారం ఉందని భావిస్తున్నారు. కానీ అసలు అధికార నిర్మాణాలు మాత్రం కార్పొరేట్ శక్తులు, మీడియా సామ్రాజ్యాలు, అంతర్జాతీయ పెట్టుబడి, భద్రతా వ్యవస్థల చేతుల్లోకి జారిపోతున్నాయి. ఇదే ఆధునిక పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అంతర్గత విషాదం. భారత రాజకీయ వ్యవస్థను గమనిస్తే ఈ వైరుధ్యాలు ఇంకా స్పష్టంగా కనిపిస్తాయి. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్యంగా భారత్‌ను చాలామంది ప్రశంసిస్తారు. 2024లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 64 కోట్లమంది ఓటింగులో పాల్గొన్నారు. వీరిలో 31 కోట్లమంది మహిళలు. ఈ అంకెల్ని చూస్తే ప్రపంచం నివ్వెరపోవాల్సిందే. అయితే, కులాధిపత్యం, ధన ప్రభావం, ఎన్నికల అవినీతి, మీడియా మానిప్యులేషన్, రాజకీయ నేరీకరణ, రాజకీయ మతీకరణ వగయిరాలన్నీ కలిసి ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్నాయంటే అతిశయోక్తి కాదు. 'సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలబడదు' అని బీఆర్ అంబేద్కర్ చాలాసార్లు హెచ్చరించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల్లోని 824 శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ వీటిల్లో ఒక్క సీటు కూడా ముస్లింలకు కేటాయించలేదు. సాక్షాత్తు ప్రధానమంత్రి స్థాయి నాయకులు ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని సాగించి హిందూ ఓట్లను ఆకర్షించడానికి ప్రయత్నించారు. బీజేపీకి ఓటు వేయనివారినీ, విపక్షాలకు మద్దతు తెలిపేవారినీ ఎన్నికల సంఘం ఏకంగా ఓటర్ల జాబితా నుండి తొలగించిందని విపక్షాలు అనేకసార్లు ఆరోపణలు చేశాయి. ఆ ఆరోపణలకు తగినట్టుగా, నిన్నటివరకు వెస్ట్ బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా పనిచేసిన మనోజ్‌కుమార్ అగర్వాల్‌ను ఆ రాష్ట్రానికి చీఫ్ సెక్రటరీగా నియమించారు. ఆ రాష్ట్రానికి స్పెషల్ ఎలక్షన్ అబ్జర్వర్‌గా వున్న డాక్టర్ సుబ్రతా గుప్తాను ముఖ్యమంత్రికి ముఖ్య సలహాదారుగా నియమించారు.

యుక్త వయస్సు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు, ప్రతి ఓటుకూ సమాన విలువ అని రాజ్యాంగం అంటే చాలామంది చాలాకాలం మైమరచిపోయారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం సమాన ఓటు హక్కు ఇవ్వగలదు, కానీ సమాన శక్తి ఇవ్వదు అని తెలుసుకోవడానికి చాలా కాలం పట్టింది. ఈ హెచ్చరిక ఇప్పుడు మరింత సత్యంగా కనిపిస్తోంది. ఎన్నికల ప్రజాస్వామ్యం కొనసాగుతోంది. కానీ సామాజిక అసమానతలు మరింత బలపడుతున్నాయి. రాజకీయ పార్టీలు ప్రజా ఉద్యమాల కంటే ఎన్నికల యంత్రాలుగా మారుతున్నాయి. పౌరులు క్రమంగా ఓటు బ్యాంకులుగా, డేటా యూనిట్లుగా మారుతున్నారు. ఇక పార్లమెంటరీ ప్రజాస్వామ్యం నిజంగా ప్రజల సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందా? అనే ప్రశ్న కీలకమైన ది. ప్రజలు ఐదేళ్లకోసారి ఓటు వేస్తారు. కానీ ఆ తర్వాత జరిగే వేలాది నిర్ణయాలన్నీ కార్పొరేట్ల అవసరాలు, లాబీయింగ్, రహస్య ఒప్పందాలు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ఒత్తిళ్ళు, మీడియా ప్రచార యుద్ధాలు, రాజ్యాంగ వ్యవస్థల కుమ్మక్కు వగయిరాల ఆధారంగా రూపుదిద్దుకుంటాయి. వీటికి అంతిమంగా 'ప్రజాస్వామ్య నిర్ణయం' అనే ముద్ర వేస్తే చాలు అది పవిత్రం అయిపోతుంది. ఇది ప్రజాస్వామ్యమా? లేక ప్రజాస్వామ్యం పేరుతో నడిచే వ్యవస్థీకృత రాజకీయ మాయా? ఎన్నికైన ప్రభుత్వాలు తీసుకున్న ప్రతి నిర్ణయం ప్రజల నిర్ణయమని భావించడం ఎంత ప్రమాదకరమో ప్రపంచం ఇరాక్ యుద్ధంలో చూసింది. ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకునే అమెరికా, బ్రిటన్ ప్రభుత్వాలు తమ దేశంలో కోట్లాది ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా యుద్ధం ప్రారంభించాయి. ఇరాక్‌లో 'వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్' (ఔవీణ) వున్నాయంటూ ఆ దేశంలోకి ప్రవేశించాయి. సద్దాం హుస్సేన్ చనిపోయినా ఆ జీవరసాయన వెపన్స్ ఆఫ్ మాస్ డిస్ట్రక్షన్ జాడ కనిపించలేదు. ఇప్పుడు ఇరాన్ మీద దాడికీ అలాంటి నెపం ఒకటి వేశారు-- ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేస్తున్నదని. యుద్ధం మొదలై 80 రోజులైనా ఎవరికీ వాటి జాడ కనిపించలేదు. ఈ యుద్ధానికి అమెరికా పౌరుల మద్దతువుందా? అదీ అనుమానమే. అయినప్పటికీ అమెరికాను గొప్ప ప్రజాస్వామిక దేశం అంటున్నారు. ఇక్కడే పార్లమెంటరీ ప్రజాస్వామ్యపు అసలు సంక్షోభం బయటపడుతుంది. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకుంటారు. కానీ ప్రభుత్వాలపై ప్రభావం చూపేది ఎవరు-- సాధారణ పౌరులా? లేక కార్పొరేట్ పెట్టుబడిదారులా? ప్రజాస్వామ్యం ఒకప్పుడు ప్రజలకు విముక్తి ఆశను ఇచ్చింది. రాజరికాలను, వలస పాలనలను, నియంతృత్వాలను సవాలు చేసే శక్తిగా ఎదిగింది. కానీ అదే ప్రజాస్వామ్యం ఇప్పుడు మార్కెట్ శక్తులతో కలిసిపోయి ప్రజలనే నిస్సహాయులుగా ఉంచేస్తోంది. 2011 మార్చి నెలలో జపాన్‌లోని ఫుకుషిమా అణు కేంద్రంలో జరిగిన ప్రమాదం దీనికి ఉదాహరణ. జపాన్‌లో ప్రజాస్వామిక ప్రభుత్వమే వుంది. అయినప్పటికీ, అది కార్పొరేట్ల ప్రయోజనాలను నేరవేర్చే క్రమంలో ప్రజల భద్రతను కూడా పక్కన పెట్టింది. ప్రజాస్వామ్యం ఉన్నంత మాత్రాన ప్రజల భద్రతకు హామీ వుంటుందని చెప్పడానికి వీల్లేదని ఫుకుషిమా సంఘటన నిరూపించింది. ఇదే నేటి ప్రపంచ సంక్షోభం.

అయితే దీనికి పరిష్కారం నియంతృత్వమా? మతద్వేషానికి విరుగుడు మతద్వేషం కానట్టే, విఫలమైన ప్రజాస్వామ్యానికి విరుగుడు నియంతృత్వం కాదు. అయితే, ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించకుండా ప్రజాస్వామ్యాన్ని కాపాడలేం. ఎన్నికల ప్రక్రియ మాత్రమే ప్రజాస్వామ్యం కాదు. ప్రజల జీవితాలపై నిజమైన నియంత్రణ, సమాచారం మీద ప్రజల హక్కు, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం-- ఇవన్నీ లేకపోతే పార్లమెంటరీ ప్రజాస్వామ్యం క్రమంగా ఒక క్రతువుగా మారిపోతుంది. ప్రజాస్వామ్యం పవిత్రగ్రంథం కాదు. అది ఒక రాజకీయ సాధనం మాత్రమే. ఆ సాధనం విముక్తి ఇవ్వగలదు, మత్తెక్కించగలదు, ప్రజలను శక్తివంతం చేయగలదు, మత ద్వేషాల్ని రెచ్చగొట్టగలదు, మోసం కూడా చేయగలదు. అందుకే మనం చెయ్యాల్సిన పని ప్రజాస్వామ్యాన్ని పూజించడం కాదు; దానిని అర్థం చేసుకోవడం. దాని మాయాజాలాన్ని ఛేదించడం. ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల పండుగ నుంచి ప్రజల నిజమైన భాగస్వామ్య వ్యవస్థగా మార్చడం. లేకపోతే 'ప్రజాస్వామ్యం' అనే పవిత్ర పదం చివరికి ప్రజల స్వరాన్నే మింగేసే రాజకీయ మత్తుమందుగా మారిపోవచ్చు. ముస్సోలిని, హిట్లర్ కూడ ముందు ప్రజాస్వామికంగానే ఎన్నికయ్యారనేది మరచిపోకూడదు.

# కనీసం 'సారీ' కూడా చెప్పాలనిపించట్లేదా?!




డియర్ ఎన్‌టీఏ నాకు పద్దెనిమిదేండ్లు. ఈ ఏడాది నీట్ 2026 ఎగ్జామ్ రాశా. పన్నెండో తరగతి నుంచే ఈ పరీక్ష కోసం శ్రమిస్తున్నా. ఎగ్జామ్‌లో ఎలాగైనా ర్యాంక్ తెచ్చుకోవాలని ప్రిపరేషన్ టైమ్‌లో స్నేహితులతో కబుర్లు చెప్పడం మానేశా. సోషల్‌మీడియాను దూరంపెట్టా. పార్టీలకూ సెలవిచ్చా. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్న ఒకే ఒక్క లక్ష్యంతో నా తోబుట్టువులతో కూడా మాట్లాడలేదు. ఇవన్నీ నేను ఎందుకు చేశానో తెలుసా? డాక్టర్‌ను కావాలన్న ఒకే ఒక్క కోరిక.. నాతో ఇవన్నీ చేయించింది. ఎప్పుడైతే పరీక్షా తేదీ దగ్గరపడుతుందో నాలో ఆందోళన అంతకంతకూ పెరుగసాగింది. ఇదే సమయంలో 'ఇది స్కూల్‌లో జరిగే పరీక్ష కాదు.. జాతీయస్థాయిలో జరిగే వడబోత పరీక్ష' అంటూ ఎగ్జామ్‌కు 10–12 రోజుల ముందు ఎన్‌టీఏ విడుదల చేసిన నోటీసు నన్ను మరింత భయపెట్టింది. అవును. ఎన్‌టీఏ చెప్పినట్టు నీట్ పరీక్ష స్కూల్‌లో జరిగే ఎగ్జామ్ మాత్రం కానేకాదు. ఎందుకు ఈ విషయం చెప్తున్నానో తెలుసా? స్కూల్‌లో జరిగే పరీక్షల్లో ప్రశ్నాపత్రాలు లీక్ అవడం అనేది ఉండదు. కానీ, నీట్ పరీక్షకు లీకుల మకిలి పట్టింది. అయినప్పటికీ, 'మేము మిగతా పరీక్షా నిర్వహణలతో పోలిస్తే, పది అడుగులు ముందుంటాం' అంటూ మీరు (ఎన్‌టీఏ) ప్రకటిస్తున్నారు చూడు.. అది సిగ్గుచేటు. ఇక్కడ ఒక్కమాట నిజం. మీరు నిజంగా పది అడుగుల ముందు ఉన్నారు. కానీ, ఏ విషయంలోనో తెలుసా? ఎగ్జామ్ సెంటర్‌ల ముందు మమ్మల్ని తనిఖీల పేరిట ఒకటికి రెండుసార్లు చెక్ చేస్తారు చూడు.. ఆ విషయంలో మీరు ముందున్నారు. అయితే, పరీక్షా కేంద్రాల దగ్గర పెట్టే అంచెలంచెల సెక్యూరిటీని.. ఎగ్జామ్ నిర్వహించే విషయంలో ఎందుకు పెట్టరు??

నీట్ పరీక్ష రోజు మేం ఎన్ని బాధలు పడ్డామో తెలుసా? ఎలాంటి లేబుల్స్ లేని పారదర్శక వాటర్ బాటిల్‌ను కూడా మేము లోపలికి తీసుకెళ్లలేమని పరీక్షా కేంద్రానికి చేరుకోగానే నాకు ఒక విషయం అర్థమయ్యింది. అసలే ఎండాకాలం. గొంతెండిపోయే పరిస్థితి. అయినప్పటికీ, మా కలలను సాకారం చేసుకోవడానికి అన్నింటినీ భరించాం. ఇక, చెకింగ్ పేరిట అక్కడ జరిగిన ప్రహసనం నా కండ్ల ముందు ఇప్పటికీ కదలాడుతున్నది. చీటింగ్ చేస్తామేమోనన్న అనుమానంతో మా ఆడపిల్లల జుత్తును విప్పమన్నారు.

మహిళా టీచర్లు తమ చేతులతో జుత్తును వేళ్లు పెట్టి మరీ చెక్ చేశారు. జేబులు ఉన్నాయన్న కారణంతో టీ–షర్టులు, ప్యాంట్ల పాకెట్లను ఎడాపెడా కత్తిరించారు. ఇదంతా నా కండ్ల ముందే జరిగింది. ఇదంతా చూస్తే, స్టూడెంట్స్ అయిన మేమే పేపర్‌ను లీక్ చేస్తామేమోనని డౌట్ మీకు ఉన్నట్టుంది. అయినప్పటికీ, ఇదంతా భరించాం. ఈ తనిఖీలన్నింటినీ చూసి ఈ సారైనా పేపర్ లీక్ కాదేమో అన్న కొండంత ఆశతో నేను ఉన్నా. లీకేజీ ఉండదని, పకడ్బందీగా అన్ని ఏర్పాట్లు చేశామని పరీక్షకు ముందు అధికారులు గుప్పించిన హామీలను, వాగ్దానాలను నేను ఎంతో నమ్మాను.

అయితే, వాస్తవంలో మాత్రం ఏం జరిగింది? మాకు చివరకు ఏం మిగిలింది? ఇప్పుడు నేను రాస్తున్న ఈ లేఖ.. కేవలం నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగానే కాదు మొత్తం ఈ వ్యవస్థ మీద నేను ఇప్పుడు చేస్తున్న పోరాటానికి ప్రతీక. అప్పుడైనా, నా యీ పోరాటంతో మాకు మల్లే ఇకపై భవిష్యత్తులో ఎవ్వరూ ఇలా నష్టపోరు కదా! ఈ సందర్భంగా ఎన్‌టీఏను ఒక్కటి అడగదలుచుకొన్నా. మీరన్నట్టు పదడుగులు ముందుండటం అంటే? ఏమిటీ?? ఈ పేపర్ లీకేజీయేనా?? అది. అయితే, సరే. మరేం పర్లేదు. పరీక్ష పత్రం లీకైంది కాబట్టి.. ఎగ్జామ్ కోసం మళ్లీ నేను చదువుతా. తనిఖీల పేరిట మీరు చేసే సెర్చింగ్‌ను నేను మరోసారి భరిస్తా. అయితే, మీకు (ఎన్‌టీఏ) ఒక్క ఆలోచన కూడా రావట్లేదా? ఇంతపెద్దయెత్తున పరీక్ష పేపర్ లీకైంది. ఇంతమంది విద్యార్థులకు ఇబ్బంది కలుగుతున్నది. మరి, వాళ్లకు క్షమాపణలు చెప్పాలన్న చిన్న ఆలోచన కూడా మీకు ఎందుకు రావట్లేదు?? సారీ పదానికి కూడా మేం అర్హులం కాదా?

మీకు ఓ విషయం అస్సలు అర్థంకావట్లేదు. నీట్ పరీక్ష కోసం నేను, నాతోపాటు లక్షలాది మంది విద్యార్థులు ఎన్ని కలలు కన్నామో తెలుసా? ఎగ్జామ్ రాసి బయటకు రాగానే.. 'హమ్మయ్య.. ఇక మా ఫ్యామిలీ, తోబుట్టువులు, ఫ్రెండ్స్‌తో హ్యాపీగా ఎంజాయ్ చేయొచ్చు' అని మేము ఎంత ఆశపడ్డామో మీకు తెలుసా? అయితే, రెండు రోజు లు గడిచాయో లేదో.. పేపర్ లీకైందని, ఎగ్జామ్‌ను మళ్లీ పెడుతారన్న వార్తలు మమ్మల్ని షాక్‌కు గురి చేశాయి. ఈ ఒక్క ప్రకటనతో వరదల్లో కొట్టుకుపోయిన ఇళ్లు మాదిరిగా మా ఆనందమంతా ఆవిరైపోయింది.

ఇక్కడ నేను మరో విషయం గుర్తు చేయదలుచుకొన్నా. పేపర్ లీకైన రోజు 11 ఏండ్ల వయసున్న మా చిన్న చెల్లి నా దగ్గరకు వచ్చింది. టీవీల్లో వార్తలను చూపిస్తూ.. 'ఇండియాలో మన భవిష్యత్తుపై ఎవ్వరికీ ఆసక్తి, శ్రద్ధ లేదు. అనవసరంగా ఎక్కువగా ఆశలు పెట్టుకోకు' అంది. ఆమె మనసులో ఇలాంటి ఆలోచనలు వచ్చేలా చేసింది ఎవరు? ఇప్పుడు ఆమెకు నేను ఏమని సమాధానం చెప్పాలి? 'లేదు.. లేదు.. చెల్లి.. ఈ వ్యవస్థ మనతోనే ఉన్నది' అని అబద్ధం చెప్పాలా? నేనూ ఓ బాధితురాలినేగా.. ఇలాంటి అబద్ధపు మాటలు నేనెలా చెప్పగలను?

ఇలాంటి పరిస్థితుల్లో ఇండియాలో మేం చదవబోమంటూ మా చెల్లి తెగేసి చెప్పింది. ఆమె మాటలను బట్టి అభద్రతా భావం అనేది ఎక్కడి నుంచి వస్తుందో నాకు ఇప్పుడు నెమ్మదిగా అర్థమవుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లో 'ఈ దేశంలో ఉండటానికి మేమెంతో గర్వపడుతున్నాం' అంటూ నేనెలా చెప్పగలను? దేశాల మధ్య సరిహద్దులు, ఆంక్షలనేవి లేకుంటే నేను కూడా ఇండియా బయట చదివేదాన్ని. ఇది నిజం. మొత్తానికి నాకు అర్థమయ్యింది ఒక్కటే! నిబంధనలు అనేవి కాగితాల మీద పొందుపరచడానికే. కానీ, వాస్తవం మరోలా ఉంటుంది. ఇప్పుడు నేను కూడా ఒకటి నిర్ణయించుకొన్నా. నీట్ ఎగ్జామ్‌కు కష్టపడినవారి కంటే, లీకులతో గట్టెక్కేవారు ఉండే ఇలాంటి చోట నేను ఉండలేను. కఠిన శ్రమకు ఎక్కడ విలువ ఉంటుందో ఆ ప్రపంచానికే వెళ్తా.

# పెగడపల్లి ఘటనపై సమతా సైనిక దళ్ ఆగ్రహం

**దళితులను ఆలయంలోకి అడ్డుకోవడం దారుణం**
**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**డా. మార్షల్ దుర్గం నగేష్**

**అగ్ని ధార న్యూస్ ,(కాల్వ శ్రీరాంపూర్):**

పెద్దపల్లి జిల్లా కాల్వా శ్రీరాంపూర్ మండలం పెగడపల్లి గ్రామంలో దళితులను ఆలయంలోకి రాకుండా అడ్డుకున్న ఘటనను సమతా సైనిక దళ్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనపై సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. “21వ శతాబ్దంలో కూడా కుల వివక్షతో దళితులను దేవాలయంలోకి రానివ్వకపోవడం సిగ్గుచేటు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ కొందరు మనువాద ధోరణితో వ్యవహరిస్తున్నారు” అని విమర్శించారు. దేవుని ముందు అందరూ సమానమేనన్న భావనను విస్మరిస్తూ వ్యవహరించడం దురదృష్టకరమన్నారు.

దళితులను ఆలయంలోకి అడ్డుకున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద వెంటనే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లా యంత్రాంగం, పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కుల వివక్షను ప్రోత్సహించే వారిని ఉపేక్షించరాదని హెచ్చరించారు. బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచి, ఆలయంలోకి దళితులు గౌరవప్రదంగా ప్రవేశించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని డాక్టర్ మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.




# రామగుండం అభివృద్ధికి రూ.9 కోట్లకు పైగా పనులు

**డీఎంఎఫ్‌టీ నిధులతో శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

రామగుండం నగరాన్ని విద్య, వైద్యం, ఉపాధి కల్పన కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ అన్నారు. మంగళవారం రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన మేయర్ మహంకాళి స్వామితో కలిసి శంకుస్థాపనలు చేశారు. మేడిపల్లి రోడ్డులో 31, 32, 33, 35, 36, 37, 38, 39, 40, 43, 44, 45, 50, 53, 55, 60 డివిజన్లలో రూ.7.30 కోట్లతో చేపట్టనున్న పనులకు శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం 30వ డివిజన్‌లో పవర్ హౌస్ నుంచి మజీద్ టర్నింగ్ వరకు పాత ఏసీ పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ వేసే రూ.1.80 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం తెలంగాణలోనే అద్భుత నగరంగా రూపుదిద్దుకుంటోందన్నారు. ఓపెన్‌కాస్ట్ ప్రభావంతో కోల్పోయిన మేడిపల్లి ప్రాంత వైభవాన్ని తిరిగి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విశాల రహదారులు, మౌలిక వసతులతో పాటు మూతపడిన ఓపెన్‌కాస్ట్ ప్రాంతంలో పంపింగ్ స్టోరేజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసే పరిశ్రమను సింగరేణి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

రాబోయే రోజుల్లో ఈ ప్రాంత భూములకు డిమాండ్ పెరిగి ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని చెప్పారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రూ.10 కోట్లు వెచ్చించి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పీకే రామయ్య కాలనీలో విశాల రహదారులు, మౌలిక వసతులు ఏర్పాటు చేశామన్నారు. రామగుండం అభివృద్ధికి ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల బీమా పథకం అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ చేయూత పింఛన్లు అందిస్తామని, ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి స్వంతింటి కల నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. నగరం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో గతంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు తిరిగి రావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారులను విస్తరిస్తున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు కోల్పోయిన వారికి సహకారం అందిస్తామని చెప్పారు. రాబోయే రెండేళ్లలో రామగుండాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ గతంలో సిఎస్ఆర్ నిధులు ఇతర ప్రాంతాలకు మళ్లినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ వచ్చిన తర్వాత పెద్దఎత్తున నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నారని చెప్పారు. రామగుండం అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీ, ఎస్ఈ గురువీర, కార్పొరేటర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనమే అజ్ఞానాన్ని చీల్చే ఆయుధం

**: శ్రీదాస్యం లక్ష్మయ్య**

**సమతా గ్రంథాలయానికి అమూల్యమైన పుస్తకాలను విరాళంగా అందించిన రిటైర్డ్ ఉపాధ్యాయులు–**
**పుస్తక సంస్కృతిని పెంచాలని దుర్గం ప్రమీల నగేష్ పిలుపు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

నేటి యాంత్రిక జీవనంలో, సోషల్ మీడియా ప్రభావంతో మనిషి జ్ఞానాన్ని పంచే పుస్తకాలకు దూరమవుతున్నాడని, అజ్ఞానాన్ని చీల్చి, విచక్షణను పెంచే ఏకైక ఆయుధం పుస్తక పఠనమేనని ప్రముఖ కవి, రచయిత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు శ్రీదాస్యం లక్ష్మయ్య అన్నారు. మంగళవారం ‘సమతా గ్రంథాలయంకు లక్ష్మయ్య దంపతులు తమ వ్యక్తిగత సేకరణలోని సుమారు 150కి పైగా విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీదాస్యం లక్ష్మయ్య మాట్లాడుతూ, “ఉపాధ్యాయుడిగా నా జీవితకాలంలో సంపాదించిన ఆస్తి ఈ పుస్తకాలే. వీటిని నా గదిలోనే ఉంచుకుంటే ఒకరిద్దరికే పరిమితమవుతాయి. అదే గ్రంథాలయానికి ఇస్తే నలుగురికి జ్ఞానాన్ని పంచుతాయి. సమతా గ్రంథాలయం ద్వారా ఈ పుస్తకాలు విద్యార్థులకు, చదువుపై ఆసక్తి ఉన్న సామాన్యులకు అందుబాటులో ఉండటం నాకు ఎంతో తృప్తినిస్తోంది” అని పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు కేవలం వినోదాన్ని మాత్రమే ఇస్తాయని, పుస్తకాలు మాత్రం ఆలోచనను, జీవితాన్ని నిర్మిస్తాయని ఆయన గుర్తుచేశారు. సమతా గ్రంథాలయ నిర్వాహకురాలు దుర్గం ప్రమీల నగేష్ మాట్లాడుతూ, సమాజ మార్పు కోసం నిరంతరం తపించే శ్రీదాస్యం లక్ష్మయ్య దంపతులు తమకు పుస్తకాలను అందించడం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. “నిరక్షరాస్యతను, మూఢనమ్మకాలను రూపుమాపి, చైతన్యవంతమైన సమాజాన్ని నిర్మించడంలో గ్రంథాలయాలు కీలకం. లక్ష్మయ్య దంపతులవంటి మహనీయులు అందించిన ఈ పుస్తకాలు మా గ్రంథాలయానికి పెద్ద ఆస్తి. వీటిని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాల వైపు పయనించాలి” అని ఆమె కోరారు.?సామాజిక సేవ, సాహిత్య రంగాల్లో శ్రీదాస్యం లక్ష్మయ్య దంపతుల నిరంతర కృషిని ప్రమీల కొనియాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య సతీమణి ఉపాధ్యాయుని గోదాదేవి సమత ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్, పాల్గొన్నారు.



# డాక్టర్ విజయ్ కుమార్ మృతి సమాజానికి తీరని లోటు....

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ విజయ్ కి ఘన నివాళులర్పించిన రాచూరు క్రీడాకారులుఈ సందర్భంగా సీనియర్స్ స్వేరొ, దుబ్బ నగేష్ మాట్లాడుతూ, ప్రజా డాక్టర్ విజయ్ కుమార్ మృతి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ డాక్టర్ గా ఎన్నో అవార్డులను అందుకున్న డాక్టర్ విజయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమైన విషయం అని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ. డాక్టర్ గానే కాకుండా షటిల్ క్రీడాకారుడుగా మంచి గుర్తింపు పొందారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ,సర్పంచ్ శ్రీనివాస్ ఉపసర్పంచ్ గణేష్, దుబ్బ నాగేష్, రౌతు కిషన్ గౌడ్,దుబ్బా రమేష్,క్రికెట్ ఆర్గనైజర్స్ ప్లేయరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ కల్చరల్ అకాడమీకి జాతీయ విస్తరణ

**గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.హెచ్. శంకర్ ముదిరాజ్**

**అగ్ని ధార న్యూస్,(రామగుండం):**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కల్చరల్ అకాడమీని జాతీయ స్థాయిలో విస్తరించేందుకు నూతన కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అకాడమీ జాతీయ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ సి.హెచ్. శంకర్ ముదిరాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ముఖ్య సలహాదారులుగా సూర్యదేవర వెంకటేశ్వరరావు, సూర్యదేవర జ్యోతి, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌లను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. అకాడమీకి అధ్యక్షుడు, కార్యదర్శితో పాటు కోర్ కమిటీ సభ్యుల నియామకాన్ని త్వరలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేరళ, ఢిల్లీ ప్రాంతాల్లో గత రెండు దశాబ్దాలుగా ప్రభుత్వ, ప్రజాహిత కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతూ కళారూపాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన అకాడమీని దేశవ్యాప్తంగా విస్తరించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అన్ని రాష్ట్రాల్లో నూతన కమిటీల ఏర్పాటుతో పాటు జాతీయ స్థాయి కార్యవర్గం, కోర్ కమిటీని త్వరలో ప్రకటించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అకాడమీ అధ్యక్షుడు బొంకూరి మధు, కార్యనిర్వాహక అధ్యక్షుడు సంకే రాజేష్, ప్రధాన కార్యదర్శి జొన్నల రవీందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంధ్యారాణికి సన్మానం

**అగ్ని ధార న్యూస్ ,(రామగుండం):**

బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా నియమితులైన సందర్భంగా లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఊరగొండ అపర్ణ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని పూలమాలలు, శాలువాలతో అభినందనలు తెలిపారు. అనంతరం సంధ్యారాణి మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానన్నారు. పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తనకు ఘన స్వాగతం పలికి సన్మానించిన అపర్ణతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ముసుకుల భాస్కర్ రెడ్డి, తడగొండ నరసయ్య, సులువ లక్ష్మీనారాయణ, కోడూరు రమేష్, బియ్యాల మహేందర్, మాదరబోయిన రాకేష్, అందే రాజ్ కుమార్ చారి, సిలారపు కళ్యాణ్, మీస వికాస్, నగునూరి లక్ష్మీనారాయణ, కొమ్మ స్వామి, తడగొండ కార్తీక్, జనగామ సాగర్, వీరబోయిన శ్రీనివాస్, వంశీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సమత గ్రంథాలయానికి కవి లక్ష్మయ్య పుస్తక విరాళం

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడం, జ్ఞానాన్ని విస్తరించడమే లక్ష్యంగా పనిచేస్తున్న స్థానిక ‘సమత గ్రంథాలయానికి’ ప్రముఖ కవి, ఉపాధ్యాయులు లక్ష్మయ్య దంపతులు విశేష సహకారం అందించారు. ?ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు దుర్గం ప్రమీల నగేష్ మాట్లాడుతూ, “సాహిత్యం పట్ల ఎంతో అనురక్తి కలిగిన లక్ష్మయ్య గారు, తమ వ్యక్తిగత సేకరణలో ఉన్న విలువైన పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా ఇచ్చారు. ఇందులో విజ్ఞానదాయకమైన పుస్తకాలతో పాటు, తెలుగు వారి సంస్కృతిని ప్రతిబింబించే ‘పెద్ద బాలశిక్ష’ వంటి ఎన్నో అరుదైన గ్రంథాలు ఉన్నాయి. ఒక కవిగా, విద్యావేత్తగా వారి ఉదారత అభినందనీయం” అని కొనియాడారు.. స్థానికులందరూ గ్రంథాలయానికి వచ్చి, ఈ పుస్తకాలను చదివి తమ మేధస్సును మరింతగా పెంపొందించుకోవాలని నిర్వాహకురాలు పిలుపునిచ్చారు. పుస్తకాలను చదవడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలు మరియు ఆధునిక విజ్ఞాన విషయాలను అర్థం చేసుకోవచ్చని తెలిపారు. స్థానిక ఉపాధ్యాయులు, సాహిత్యాభిమానులు తమ వద్ద ఉన్న పుస్తకాలను గ్రంథాలయానికి విరాళంగా అందిస్తున్నారని, ఎవరైనా కొత్తవారు పుస్తకాలను విరాళంగా ఇవ్వాలనుకుంటే సంతోషంగా స్వీకరిస్తామని ప్రమీల నగేష్ పేర్కొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన భూంపెల్లి రాజయ్య..!

**అగ్నిధార న్యూస్ కమన్పూర్**

కమాన్ పూర్ : రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లో మంగళవారం కమాన్ పూర్ మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు భూంపెల్లి రాజయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమాన్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లె లో గల డ్రైనేజి నీరు బయటకు పంపించడం కోసం కిష్టంపల్లె నుండి పిల్లిపల్లె రోడ్డులో గల కే ఎన్ ఫంక్షన్ హాల్ వరకు నిర్మించుటకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ.. వినతి పత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ యూసుఫ్ లల్లూ, సాగర్ల కొమురయ్య లతో పాటు తదితరులు ఉన్నారు.



## సభ్యత్వాల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



**కార్యకర్తలకు దిశ నిర్దేశం చేసిన మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలంలో సభ్యత్వల నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యధిక మంది సభ్యులతో బీఆర్ఎస్ సభ్యత్వల ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. శ్రేణులతో అవగాహన సమావేశం నిర్వహించారు.అనంతరం సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అనంతరం నాగర్ కర్నూల్ జిల్లా బీ ఆర్ ఎస్ పార్టీ సభ్యత్వల ఇన్చార్జి మెట్టు శ్రీనివాసుని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.ఈ కార్యక్రమంలో, పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పుట్టరామ్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు జోగయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, మాజీ వైస్ ఎంపిపి,వెంకటయ్య గౌడ్,సర్పంచ్ కొండల్ యాదవ్,మాజీ ఉపసర్పంచ్ నిరంజన్, నరసింహ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అశోక్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## 2 పాములతో 20 కోట్లా..

**వరంగల్ :** వరంగల్ నగరంలో రెండు తలల పాము రెడ్ సాండ్ బోవా అక్రమ రవాణా గుట్టును డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. గ్రే మార్కెట్‌లో కోట్లాది రూపాయల విలువ చేసే ఈ అరుదైన పాములను విక్రయించేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తోందన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, ఒక సినిమా ఫక్కీలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించి నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడు రెండు సజీవమైన ఇండియన్ రెడ్ సాండ్ బోవా పాములను బ్యాగ్‌లో దాచుకుని కస్టమర్ల కోసం ఎదురుచూస్తున్న సమయంలో అధికారులు దాడి చేశారు. ఈ పాములకు అంతర్జాతీయ బ్లాక్ మార్కెట్‌లో కళ్లు చెదిరే ధర పలుకుతోంది.

# సమాజ మార్గదర్శకులు పుచ్చలపల్లి సుందరయ్య

వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి
నివాళులర్పించిన సీపీఎం నాయకులు
సిపిఎం పార్టీ నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

భారత సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి నిరంతరం కృషి చేసి సమాజ మార్గదర్శకులుగా నిలిచిన మహోన్నత వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సిపిఎం జిల్లా నాయకులు ఏపీ మల్లయ్య ఆయన చేసిన సేవలను కొనియాడారు మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సుందరయ్య 41 వర్ధంతి సభలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు అనంతరం ఏపీ మల్లయ్య మాట్లాడుతూ దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నేత సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టి సాధారణ జీవితం గడిపి దోపిడి అణిచివేత అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి చైతన్యపరిచి పోరాటాల మార్గాన్ని చూపించిన విప్లవ కెరటం అని అన్నారు భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటానికి రథసారథిగా నిలిచారని అన్నారు పార్లమెంటుకు సైకిల్ పై వెళ్లి ప్రజా సమస్యలను ప్రతిబింబించిన నేత అని అన్నారు



సుందరయ్య మరణించి 40 సంవత్సరాలు గడిచినప్పటికీ ప్రపంచ చరిత్రలో మచ్చలేని మహానాయకుడుగా పేరు పొందారని అన్నారు కమ్యూనిస్టు శ్రేణులు అభ్యుదయవాదులు సామాజిక ఉద్యమ నేతలు యువకులు మహిళలు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆయన చూపిన బాటలో పయనించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు అంజనేయులు ఎంప్లాయిస్ పత్రిక ఎడిటర్ కె వెంకటేశ్వర్లు సిపిఎం నాయకులు బాల్ రెడ్డి కానుగుల వెంకటయ్య చెన్నయ్య శ్రీనివాసులు బాలయ్య కృష్ణారెడ్డి కూరగాయల యాదయ్య భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుల కృషితో జాతీయ స్థాయికి విద్యార్థులు

సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం వెల్జల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో పాల్గొనడం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. 2025-26 విద్యా సంవత్సరంలో స్పందన, చందు, శివ అనే విద్యార్థులు అత్య-పత్య ఆటల్లో తమ ప్రతిభను చాటుతూ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని పాఠశాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. విద్యార్థుల కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని వారు పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ పాఠశాల పి.డి పరమేష్ విద్యార్థులకు నిరంతరం శిక్షణ అందిస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించారని ఉపాధ్యాయులు తెలిపారు.




గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా సరైన ప్రోత్సాహం, కృషి ఉంటే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచగలరని ఈ విజయాలు నిరూపిస్తున్నాయని అన్నారు. జాతీయ స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులకు ప్రభుత్వం క్రీడా దుస్తులు పంపిణీ చేసింది ఈ సన్మాన కార్యక్రమం విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని నింపగా, భవిష్యత్తులో ఇంకా ఉన్నత విజయాలు సాధించాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు నసీమ సుల్తానా ,గ్రామ పెద్దలు శ్రీనివాసమూర్తి, అంజయ్య గౌడ్, వెంకట్ రెడ్డి, అశోక్ బాబు, వెంకట్ రెడ్డి, .అంబాజీ, అజీజ్, ఎల్ మల్లేష్, పులిజాల విష్ణు , శ్రీనివాస్ గౌడ్, కోటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# దొంగ అరెస్ట్

కారు, బైక్, బంగారు గొలుసు స్వాధీనం
డ్రైవర్‌గా పని... డబ్బులు సరిపోక దొంగతనాలు
సిఐ పెద్దపల్లి ప్రవీణ్ కుమార్

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి జిల్లా19**

సోమవారం పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడి అరెస్టుకు సంబంధించిన వివరాలను పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్సై మల్లేశం వెల్లడించారు. సోమవారం ఉదయం ఎస్సై మల్లేశం సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కూనారం రైల్వే గేట్ ప్రాంతంలో ఒక వ్యక్తి అనుమానాస్పదంగా పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా అతడిని అదుపులోకి తీసుకుని విచారించారు.సరైన సమాధానాలు చెప్పకపోవడంతో పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా గతంలో చేసిన నేరాలను ఒప్పుకున్నాడు. రంగారెడ్డిగూడెం గ్రామం,పెద్ద అడిశర్ల మండలం,నల్గొండ జిల్లా చెందిన ఊరడి జనార్ధన్, తండ్రి రామచంద్రం( 31)కులం ముదిరాజ్ నుండి స్వాధీనం చేసుకున్న వస్తువులు:

**రెడ్ కలర్ బలెనో కారు**

20 గ్రాముల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. నిందితుడు ఊరడి జనార్ధన్ కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనంసాగిస్తు. కుటుంబ ఖర్చులకు, సంపాదన సరిపోకపోవడంతో తన స్నేహితుడు తమ్మిశెట్టి వెంకటేష్, తండ్రి లక్ష్మీనారాయణ( 26) వడ్డెర, నివాసం మాదారం గ్రామం, ముప్పాల మండలం, పల్నాడు జిల్లాతో కలిసి తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని, నిర్ణయించుకున్నాడు. గతంలో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి రాత్రి సమయంలో చోరీలు చేసి దొంగిలించిననగదు,బంగారాన్ని ఇద్దరూ పంచుకునేవారు. తర్వాత వెంకటేష్ అన్న తమ్మిశెట్టి మణికంఠ( 26 నివాసం మాదారం గ్రామం, ముప్పాల మండలం, పల్నాడు జిల్లా ను కలుపుకుని ముగ్గురూ కలిసి దొంగతనాలు చేసేవారు. 2025 సెప్టెంబర్ నెలలో నల్గొండలో కారు అద్దెకు తీసుకుని వరంగల్,కరీంనగర్ మీదుగా పెద్దపల్లికి చేరుకుని, సుల్తానాబాద్ శివారులో ఒక ఇంటి వద్ద కనిపించిన స్కూటీని తీసుకుని నిమ్మనపల్లి గ్రామానికి వెళ్లారు. సెప్టెంబర్ 15 అర్ధరాత్రి ఒక ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించారు. అనంతరం ముగ్గురూ గుంటూరు మీదుగా గోవాకు,పారిపోయారు. అక్కడ కొంత బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి వచ్చిన డబ్బులతో జల్సాలుచేశారు. దొంగిలించిన సొత్తులో తన వాటాగా వచ్చిన రెండు తులాల బంగారు గొలుసును తనవద్దే ఉంచుకున్నాడు. మరోసారి దొంగతనం చేయాలనే ఉద్దేశంతో అదే కారులో పెద్దపల్లికి వచ్చిన సమయంలో కూనారం రైల్వే గేట్ సమీపంలో పోలీసులు అనుమానంతో పట్టుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన పెద్దపల్లి సీఐ కె.ప్రవీణ్ కుమార్, పెద్దపల్లి రూరల్ ఎస్సై మల్లేశ్,ఏఎస్ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీలు ప్రభాకర్, పొగుల రమేష్, అనిల్‌లను రామగుండం సి.పి పెద్దపల్లి డీసీపీ,ఏసీపీలు, అభినందించారు.



# ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మృతురాలు కుటుంబానికి ఆర్థిక సహాయం



బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన జోగు లలితమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలు కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జోగు రమణమ్మ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ రవీందర్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు ఎజాస్, పర్వతాలు, రుక్మ రెడ్డి, కేశవరెడ్డి, ఈశ్వరయ్య, వెంకటయ్య, అర్జునయ్య, లింగయ్య, పరుశురాములు, వెంకటయ్య, నాగార్జున, బంగారయ్య, సాయిలు, నరసింహ, బాలయ్య, బంగారయ్య,యువకులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరిఖని నుండి ఎగ్లాస్‌పూర్ బస్సు సర్వీస్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**అగ్నిధారన్యూస్**
**?గోదావరిఖని19:**

రామగుండం ఎమ్మెల్యేకోరిక మేరకు ప్రయాణికుల సౌకర్యార్థం గోదావరిఖని నుండి ఎగ్లాస్‌పూర్ వరకు నూతన బస్సు సర్వీసును రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ ప్రారంభించారు. ఎగ్లాస్‌పూర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి బస్సును ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలనుమెరుగుపరచడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్లాస్‌పూర్ సర్పంచ్ జూపాక మమత, ఉప సర్పంచ్ రాకేష్, మరియు గోదావరిఖని డిపో మేనేజర్ నాగభూషణం పాల్గొన్నారు. ప్రయాణికులందరూ



ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ నాగభూషణం కోరారు. ?సమయాలు: బస్టాండ్ నుండి నుండి: ఉదయం7:00,సాయంత్రం4:00 మరియు ఎగ్లాస్‌పూర్ నుండి: ఉదయం 8:00,సాయంత్రం 5:00 బయలుదేరుతాయని మేజర్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళా మృతి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండలం కోట్ర గేట్ సమీపంలో శ్రీశైలం హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో కారులో ప్రయాణిస్తున్న దంపతులు రోడ్డు ప్రమాదంలో జలాల జయమ్మ మృతి చెందింది. భర్తకు కూతురికి తీవ్ర గాయాలు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతురాలు వంగూరు మండలం సర్వ రెడ్డి పల్లి గ్రామానికి చెందినవారు దంపతులు హైదరాబాద్ కు వెళుతున్న సమయంలో కొట్ర గేట్ సమీపంలో ఈ సంఘటన జరిగింది సంఘటననికి పోలీసులు పేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు జయమ్మ మృతదేహాన్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

# బాలిక మరణం విషాదకరం



ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేసిన ఉప్పల వెంకటేష్

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన బాలిక బొల్లె మహిత నీటి సంపులో పడి మరణించడం జరిగింది.స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ సర్పంచ్ సుశీల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల చారి ట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారాన్ని అందించి బాలిక కుటుంబానికి తెలుపుతూ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మణమ్మ మైబుయాదవ్ , సింగిల్ విండో డైరెక్టర్ లింగం నిరంజన్, జెనిగల నరేష్, వెంకట్రాంరెడ్డి, మావురుగల్ల రమేష్, బొల్లె లక్ష్మణ్, మావురుగల్ల పరశురాములు, బొల్లె రామస్వామి,బొల్లె జగన్, బొల్లె దేవరాజ్, మరియు బీఆర్ఎస్ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది.

# ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించిన కమిషనర్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛత, ప్రజారోగ్య పరిరక్షణ మరియు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పందుల యజమానులతో సమావేశం నిర్వహించడం జరిగింది ఇట్టి

సమావేశంలో పందుల యజమానులు తమ పందులను మున్సిపాలిటీ పరిధి నుండి మున్సిపాలిటీ కి దూరంగా తరలించాలి అని కమీషనర్ మహ్మద్ సూచించడం జరిగింది దానికి పందుల యజమానులు తాము తరలిస్తామని లిఖితపూర్వకంగా అంగీకార పత్రం సమర్పించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, పందులను తరలించుటకు 5 రోజుల గడువు ఇవ్వడం జరిగింది అప్పటికీ పందులను తరలించని యజమానులపై మున్సిపల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యం మరియు పట్టణ పరిశుభ్రత దృష్ట్యా అందరూ మున్సిపాలిటీకి సహకరించాలని కోరడమైనది. ఇట్టి సమావేశం లో మునిసిపల్ వైస్ చైర్పర్సన్ షానవాజ్ ఖాన్ స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగార్జున సబ్ ఇన్స్పెక్టర్ కురుమూర్తి మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు

# నీటి సంపులో పడి బాలిక మరణం



సహాయం అందజేసిన సర్పంచ్ ఆశాదీఫ్ రెడ్డి

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని తాండ్ర గ్రామంలో ప్రమాదవ శాత్తు నీటి సంపులో పడి చిన్నారి మరణించడం జరిగింది.విషయం తెలుసుకున్న రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గ్రామ సర్పంచ్ ఆశాదీప్ రెడ్డి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకొని వెంటనే స్పందించి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామంలో ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా అన్ని విధాలుగా అండగా ఉంటానని అయన అన్నారు. ఈ కార్యక్రమంలో, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ ను కలిసిన టిపిసిసి ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటి సభ్యులు

**హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ సెక్రటరీ లింగ్య నాయక్ ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎలక్షన్ కమిషన్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ మరియు సభ్యులు కలవడం జరిగినది.

బుధవారం 20 మే 2026
అగ్నిధార
http://www.agnidharanews.com
నిజాల నిప్పుం కణిక

# లక్ష్యాలను పూర్తి చేయాలి

## ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

### 2026-27 సంవత్సరానికి 1150 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం.

### 370 ఎకరాలకు రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లింపు

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మే-19:**

జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణతో పాటు ఉద్యాన శాఖ లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.

మంగళవారం ఐడీఓసీలో ఉద్యాన శాఖ, ఆయిల్ పామ్ అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ....**

2026-27 సంవత్సరానికి జిల్లాకు 1150 ఎకరాల ఆయిల్ పామ్ సాగు లక్ష్యం నిర్దేశించామని ఇప్పటివరకు 370 ఎకరాలకు రైతులు ముందుకు వచ్చి డీడీలు చెల్లించారని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల నుంచి డీడీలు సేకరించడంతో పాటు మొక్కల సరఫరా, డ్రిప్ ఇరిగేషన్ పనులు వచ్చే ఖరీఫ్ నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖలో అమలవుతున్న ఇతర పథకాల లక్ష్యాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో కూరగాయలు, పండ్ల తోటల సాగును ప్రోత్సహించి రైతులకు అధిక ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిహెచ్ఎస్ఓ జగన్మోహన్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు, ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# కుంటలు కాపాడండి కలెక్టర్ కు ఫిర్యాదు

**ఆక్రమణలను అడ్డుకోవాలని మత్స్యకారుల విజ్ఞప్తి.**

**అగ్నిధారన్యూస్ ,(పెద్దపల్లి):**

ప్రభుత్వ ఆస్తులు అయిన చెరువులు, కుంటలను ఆక్రమించి వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించేందుకు ప్రయత్నిస్తున్న ఆక్రమ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కారుపాక సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి మండలం పెద్ద బొంకూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 389లో ఉన్న 'ధర్మయ్య కుంట: 10 ఎకరాల 8 గంటలు అలాగే 376 సర్వే నెంబర్ లోని 3ఎకరాల 25గుంటలు ఉన్న 'మెసమ్మ కుంట'లను ప్రభుత్వ రికార్డుల్లో మైనర్ ట్యాంకులుగా నమోదు చేశారని ఆయన ఫిర్యాదులు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'మిషన్ కాకతీయ' కార్యక్రమంలో భాగంగా ఈ చెరువులను పునరుద్ధరించి సాగునీటి సౌకర్యం కల్పించినప్పటికీ, కొందరు వ్యక్తులు రికార్డులను తప్పుదోవ పట్టిస్తూ చెరువులను పూడ్చివేసి ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు.చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిని నింపడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో గ్రామ ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించే ఇటువంటి అక్రమ చర్యలను వెంటనే అడ్డుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించిన సంపత్ కుమార్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించి చెరువుల హద్దులను ఖరారు చేయాలని కోరారు. అదేవిధంగా సంబంధిత సర్వే నంబర్లను సెక్షన్ 22-ఎ కింద నిషేధిత జాబితాలో అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయాలని కోరారు. విలువైన భూమిని ఇలాగే వదిలితే భవిష్యత్తులో రియల్ ఎస్టేట్ ప్లాట్స్ పెట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.మత్స్యకారుల జీవనోపాధి, గ్రామ ప్రజల నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి చెరువులను రక్షించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

# అన్నదాతలకు అవగాహన కార్యక్రమం

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:**

మహమ్మదాబాద్ లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ పరిమల్ కుమార్ రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వానాకాలం ప్రారంభంలోనే రైతులకు అవగాహన కల్పించడంలో భాగంగా క్షేత్రస్థాయిలోని రైతులకు ఖరీఫ్ సీజన్‌లో అధిక దిగుబడులను ఇచ్చేటువంటి నూతన వంగడాలు, రకాలపై మరియు ఆరుతడి వరి సాగు చెయ్యడం వల్ల కలిగే ప్రయోజనాలను, పంట మార్పిడి వల్ల కలిగే ప్రయోజనాలను, సమగ్ర ఎరువుల నిర్వహణ గురించి వివరిస్తూ యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాల గూర్చి, విత్తన కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి, భూగర్భ జలాల పరిరక్షణ కోసం సాగు నీటి వినియోగం పై అవగాహన, పంటల మార్పిడి, సహజ వ్యవసాయం మరియు పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల గూర్చి విస్తృతంగా రైతులకు డాక్టర్ పరిమల్ కుమార్ అవగాహన కల్పించడం జరిగింది. రైతులు వరి గడ్డిని కాల్చడం వల్ల కలిగే నష్టాలను, లోతైన దుక్కి చెయ్యడం వలన కలిగే ప్రయోజనాన్ని రైతులకు తెలియజేసారు.




ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రామ్ లాల్, చిన్నయ పల్లి సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీపీ శాంతి, నాయకులు అనంతయ్య, రాఘవేంద్ర రెడ్డి, కృష్ణ, అంజిలయ్య, విష్ణువర్ధన్ యాదయ్య, దస్తయ్య, నర్సింలు, కిరణ్, లక్ష్మయ్య, మండల వ్యవసాయ అధికారి నరేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు నిఖితా, మౌనిక మరియు తదితరులు పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల ఆకస్మిక తనిఖీ



**ధాన్యం అన్‌లోడింగ్ లో జాప్యం లేకుండా చూడాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.**

**పెద్దబొంకూర్, పూసాల రైస్ మిల్లులను తనిఖీ**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి, మే-19 :**

జిల్లాలో రైతులు విక్రయిస్తున్న ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అన్‌లోడింగ్ చేసి నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్‌లోని రాఘవేంద్ర రైస్ మిల్, సుల్తానాబాద్ మండలం పూసాలలోని మహేష్ రైస్ మిల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ..**

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా అన్‌లోడింగ్ చేసి నిల్వ చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం దిగుమతులను వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు. ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలు, అన్‌లోడింగ్ పరిస్థితులు, వాహనాల నిర్వహణ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించి సంబంధిత నిర్వాహకులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పర్యటనలో పౌర సరఫరా సిబ్బంది మహేష్ , రవీందర్,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్ పై దాడి సరికాదు,బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలి



**కె.యం.చంద్రకాంత్ సిపీఎస్ యూనియమ్ జిల్లా అధ్యక్షులు**

**అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్ :**

గండీడడ్ మండలంలో జనగణన (సెన్సస్) విధుల్లో ఉన్న ఎన్యుమరేటర్ డి. సంజీవరెడ్డిపై దాడికి పాల్పడిన గోపాల్ అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని టి.ఎస్.సి.పి.ఎస్.ఇ.యు (టీఎస్ సిపి యు) మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు కె.యం.చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ?గండీడ్ మండల కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై ఇలాంటి దాడి జరగడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై స్పందిస్తూ ?దాడికి పాల్పడిన నిందితుడిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మల్లికార్జున్ కి, ఎస్సై శేఖర్ రెడ్డి కి వినతి పత్రం ఇవ్వటం జరిగింది.

భవిష్యత్తులో ఇలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా, ప్రతి గ్రామంలో దండోరా (చాటింపు) వేయించి ప్రజలకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వే విధుల్లో పాల్గొంటున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు తగిన రక్షణ కల్పించాలి. ?శాంతిభద్రతలను కాపాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ఎలాంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించేలా అధికారులు తక్షణమే చొరవ చూపాలని చంద్రకాంత్ కోరారు.

## హైదరాబాద్‌లో దారుణం

### మహిళలను చీరలెత్తి చూస్తున్న చైన్ స్నాచర్

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌కు సమీపంలో ఉన్న మణికొండ, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. పట్టపగలే, జనసంచారం ఉన్న ప్రాంతంలో ఒక మహిళ పట్ల జరిగిన ఈ అసభ్య ప్రవర్తన మహిళా భద్రతపై మరోసారి ప్రశ్నలను లేవనెత్తుతోంది. మణికొండ, అల్కాపూర్ టౌన్‌షిప్‌లో అత్యంత వికృతమైన ఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల గురించి వినే ప్రజలకు, ఇప్పుడు వీధుల్లో మహిళల పట్ల జరుగుతున్న అసభ్య ప్రవర్తన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రోడ్డు నంబర్ 4లోని ప్రణతి ఈషా అపార్ట్‌మెంట్ సమీపంలో.. తన చిన్నారితో కలిసి స్కూల్ నుండి ఇంటికి తిరిగి వస్తున్న ఒక మహిళపై ఒక టీనేజ్ బాలుడు అత్యంత నీచంగా ప్రవర్తించాడు. వెనుక నుంచి వచ్చి ఆమె దుస్తులను ఎత్తి వికృత చేష్టలకు పాల్పడి, అక్కడి నుంచి పారిపోయాడు.ఈ మొత్తం ఉదంతం అక్కడ ఉన్న సిసిటివి కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యింది. పట్టపగలు, అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘటన చూస్తుంటే.. నేరస్థులకు చట్టం అన్నా, పోలీసులన్నా ఎంత చులకన భావం ఉందో అర్థమవుతోంది. కేవలం అల్లరి పనిలా కాకుండా, ఇది ఒక మహిళ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే తీవ్రమైన వేధింపుగా స్థానికులు పరిగణిస్తున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలతో వెళ్తున్న తల్లులను ఇలాంటి మానసిక రోగులు లక్ష్యంగా చేసుకోవడం భయాందోళనలకు గురిచేస్తోంది. అల్కాపూర్ టౌన్‌షిప్ వంటి ప్రాంతాల్లో కూడా మహిళలకు రక్షణ కరువైందని బాధితురాలి కుటుంబ సభ్యులు, స్థానిక నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం చైన్ స్నాచింగ్‌ల నుంచే కాదు, ఇలాంటి వికృత బుద్ధి గల వారి నుంచి కూడా మా ఆడబిడ్డలను కాపాడుకోవాల్సి వస్తోంది అని స్థానికులు వాపోతున్నారు. ఇలాంటి ఘటనలు కేవలం వ్యక్తిగత వేధింపులు మాత్రమే కావు.. ఇవి సమాజంలో పెరుగుతున్న వికృత పోకడలకు అద్దం పడుతున్నాయి. సోషల్ మీడియా ప్రభావమో లేదా సరైన పర్యవేక్షణ లేకపోవడమో కానీ, మైనర్లు కూడా ఇలాంటి దారుణాలకు పాల్పడటం ఆందోళనకరం. పోలీసులు వెంటనే స్పందించి, నిందితుడిని పట్టుకోవడమే కాకుండా, ఇలాంటి ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉందన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి.

# తరుగు పేరిట ధాన్యం కోతలు

## వరి -- మొక్కజొన్న రైతుల అవస్థలు, చెరువు మట్టి--మొరం అక్రమాలపై చర్యలు తీసుకోవాలి: మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



అగ్నిధారన్యూస్ పెద్దపల్లి

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో పెద్దపల్లి నియోజకవర్గ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అవ్యవస్థ, మిల్లర్ల దోపిడీ, చెరువులు--గుట్టల మట్టి అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ**

రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర, కల్పించాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ ఏడాది రైతులు నమ్మకంతో భారీ ఎత్తున మొక్కజొన్న సాగు చేసినప్పటికీ, ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌లో వందలాది మొక్కజొన్న కుప్పలు పేరుకుపోయినా తూకాలు సకాలంలో నిర్వహించక రైతులు రోజులు తరబడి కొనుగోలు కేంద్రాల వద్దే వేచి ఉండాల్సి వస్తోందన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వర్షాలు కురిస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తడిసిన మొక్కజొన్నను నాణ్యత పేరుతో తిరస్కరించే అవకాశం ఉండటంతో రైతులపై మరింత భారం పడుతుందని అన్నారు.

సంచుల కొరత కారణంగా రైతులనే బయట మార్కెట్‌లో అధిక ధరలకు బార్దాన్ కొనుగోలు చేయమని ఒత్తిడి తెస్తున్నారని, దీనివల్ల రైతుకు నేరుగా ఆర్థిక నష్టం జరుగుతోందని విమర్శించారు.

**వరి కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి**

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, రైస్ మిల్లుల అలాట్‌మెంట్‌లో ఆలస్యం కారణంగా ధాన్యం ఇంకా కల్లాల్లోనే నిల్వ ఉందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకు విరుద్ధంగా అధిక తూకం వేయడం, తరుగు పేరిట అదనపు కోతలు విధించడం ద్వారా రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు.

**చెరువులు -- గుట్టలను మింగేస్తున్న మట్టి మాఫియా**

పెద్దపల్లి నియోజకవర్గంలో చెరువులు, గుట్టల నుంచి అక్రమంగా మట్టి తరలింపు జరుగుతోందని ఆరోపించారు. చెరువుల్లో నీరు ఉన్నప్పటికీ గండి కొట్టి నీటిని వదిలి ఇటుక బట్టీల కోసం మట్టి తరలించడం దురదృష్టకరమన్నారు.

శివపల్లి, చీమలపేట, పెగడపల్లి, పాలిథం, గోపయ్యపల్లి, తురకల మద్దికుంట, ఎదులాపూర్ ప్రాంతాల్లో ఎలాంటి మైనింగ్ అనుమతులు లేకుండానే తవ్వకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో ఉప్పు రాజకుమార్,మార్కు లక్ష్మణ్ ,తాన్నత్రి మోహన్ రావు,గుణపతి, జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లు,సలేంద్ర రాములు, కౌన్సిలర్ ఓదెలు, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్,దయాకర్, నాంసాని సరేష్ బాబు,దయాకర్, ముత్యాల రాజయ్య, పోసాని శ్రీనివాస్, పాల్గొన్నారు..

## వాహనదారులకు షాక్..

## మళ్లీ పెరిగిన పెట్రోల్, డీజిల్ ధరలు

వాహనదారులకు మళ్లీ షాక్.. దేశవ్యాప్తంగా మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్, డీజిల్‌పై 90 పైసల చొప్పున రేట్లను పెంచింది. కాగా, ఇంధన ధరల పెంపు వారం రోజుల్లో ఇది రెండోసారి కావడం గమనార్హం. ఇటీవల లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3వరకు పెంచిన సంగతి తెలిసిందే. దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు పెరిగింది. దీంతో లీటర్ పెట్రోల్ ధర రూ.98.64, డీజిల్ ధర రూ.91.58కు చేరింది. శుక్రవారం నాడే కేంద్ర ప్రభుత్వం లీటర్‌కు రూ.3 చొప్పున పెంచింది. దీంతో పెట్రోల్ రూ.94.77 నుంచి రూ.97.77, డీజిల్ రూ.87.67 నుంచి రూ.90.67కు పెరిగింది. తాజా పెంపుతో ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ.107.59, డీజిల్ రూ.94.08కు పెరిగింది. కోల్‌కతాలో లీటర్ పెట్రోల్ ధర రూ.109.70, డీజిల్ రూ.96.07కు చేరింది. చెన్నైలో లీటర్ పెట్రోల్ ధర రూ.104.49, డీజిల్ రూ.96.11కు పెరిగింది. కోల్‌కతాలో పెట్రోల్‌పై అత్యధికంగా 96 పైసల పెంపు నమోదైంది. దాని తర్వాత ముంబైలో పెట్రోల్‌పై 91 పైసలు, డీజిల్‌పై 94 పైసలు పెరిగింది. చెన్నైలో పెట్రోల్‌పై 82 పైసలు, డీజిల్‌పై 86 పైసలు పెరిగాయి. పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే దేశీయంగా ఇంధన ధరలు మరింత పెరిగే అవకావం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

## రూ.లక్ష కోట్లు సమీకరణపై ఆశలు

వచ్చే మూడేళ్లలో అవసరమయ్యే రూ. 1 లక్ష కోట్లను సమకూర్చుకునేందుకు కొత్త రుణాలు, ట్యాక్స్ రిఫండ్‌లు, ప్రమోటర్ల నుంచి మరిన్ని పెట్టుబడులపై టెలికం సంస్థ వొడాఫోన్ ఐడియా (వీఐ) భారీగా ఆశలు పెట్టుకుంది. మార్కెట్లో నిలబడే దిశగా నెట్‌వర్క్‌ని మెరుగుపర్చుకునేందుకు కంపెనీ దాదాపు రూ. 45,000 కోట్లు వెచ్చించనుంది. అలాగే, వచ్చే మూడేళ్లలో స్పెక్ట్రం చార్జీల కింద సంస్థ రూ. 49,000 కోట్లు, రుణభారానికి సంబంధించిన వడ్డీల కోసం మరో రూ. 5,000–6,000 కోట్లు చెల్లించాల్సి రానుంది. అయితే.. మరింత రుణాన్ని ఈక్విటీ కింద మార్చాల్సిన అవసరం లేకుండానే తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించగలమని వీఐ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ తేజస్ మెహతా తెలిపారు. తాము రూ. 25,000 కోట్ల నిధులతో పాటు మూడేళ్ల వ్యవధిలో రూ. 60,000 కోట్ల వరకు ఎబిటాను సాధించగలమని ఆయన పేర్కొన్నారు. ఇక ట్యాక్స్ రిఫండ్ కింద మరో రూ. 10,000 కోట్లు రావాల్సి ఉంటుందని వివరించారు.

**కొత్త ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాకేజీలు..**

పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల కోసం కొత్తగా మరిన్ని ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాకేజీలను ఆవిష్కరించినట్లు వీఐ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అవనీష్ ఖోస్లా తెలిపారు. ఇవి 7 రోజులు, 14 రోజులు, 21 రోజుల కాలవ్యవధితో లభిస్తాయని వివరించారు. దీనితో మొత్తం 1 రోజు నుంచి 30 రోజుల వరకు వేలిడిటీతో 17 రకాల ప్యాక్‌లను అందిస్తున్నట్లవుతుందన్నారు.

# వండర్ వైభవ్.. దంచికొట్టిన సూర్యవంశీ

**లక్నోపై రాజస్థాన్ ఘన విజయం**

**ప్లేఆఫ్స్ రేసులో ముందంజ**

తన వయసు పిల్లలంతా వేసవి సెలవులను ఆస్వాదిస్తుంటే.. ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ (38 బంతుల్లో 7 ఫోర్లు, 10సిక్సర్లతో 93) మాత్రం వరల్డ్ క్లాస్ బౌలర్లను ఓ ఆటాడుకుంటున్నాడు. తన బ్యాట్ పవర్‌తో ప్రత్యర్థులను బెంబేలెత్తిస్తున్నాడు. బంతి ఏ బౌలర్ చేతుల్లోంచి వచ్చినా ఈ బుడ్డోడి బ్యాట్ తాకగానే బౌండరీ దాటేస్తోంది. ఈ కుర్ర హీరో విధ్వంసానికి ఈసారి లక్నో సూపర్ జెయింట్స్ బలైపోయింది..! చివరి మ్యాచ్‌ల్లో గెలిచి పరువైనా దక్కించుకోవాలని ఆశించిన జెయింట్స్ ఈ సూర్య 'ప్రతాపం' ముందు తేలిపోయింది. భారీ లక్ష్య ఛేదనలో ఖతర్నాక్ షాట్లతో ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించిన సూర్యవంశీ రాజస్థాన్‌కు అద్భుత విజయం అందించి జట్టును ప్లేఆఫ్స్ రేసులో నిలిపాడు. ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే తప్పక గెలువాల్సిన పోరులో రాజస్థాన్ రాయల్స్ సత్తాచాటింది. వైభవ్ వీరబాదుడు బ్యాటింగ్‌తో చెలరేగడంతో సొంతగడ్డపై మంగళవారం జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో లక్నోపై ఘన విజయం సాధించింది. లీగ్‌లో ఏడో విజయంతో పంజాబ్‌ను వెనక్కునెట్టి నాలుగో స్థానానికి చేరింది. తమ చివరి మ్యాచ్‌లో గెలిస్తే ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా రాయల్స్ నేరుగా ప్లేఆఫ్స్ చేరుకోనుంది. లక్నో ఇచ్చిన 221 పరుగుల లక్ష్యాన్ని రాయల్స్ 19.1 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి అందుకుంది. ధ్రువ్ జురెల్ (38 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 53 నాటౌట్), స్టాండిన్ కెప్టెన్ యశస్వి జైస్వాల్ (43) కూడా రాణించారు. తొలుత మిచెల్ మార్ష్ (57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96), జోష్ ఇంగ్లిస్ (29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60) మెరుపులతో లక్నో 20 ఓవర్లలో 220/5 స్కోరు చేసింది. వైభవ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

**దంచుడే.. దంచుడు**

సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్‌కు జైస్వాల్, జురెల్ మెరుపులు తోడవడంతో భారీ లక్ష్యాన్ని రాజస్థాన్ అలవోకగా



అందుకుంది.ఓపెనర్లు జైస్వాల్, వైభవ్ తొలి వికెట్‌కు 75 రన్స్ జోడించి విజయానికి బాటలు వేశారు. తొలి ఓవర్లోనే నాలుగు ఫోర్లు కొట్టిన జైస్వాల్.. మోసిన్ ఖాన్ వేసిన నాలుగో ఓవర్లో 6, 4, 4, 4తో విజృంభించాడు. తన స్టయిల్‌కు భిన్నంగా తొలి పది బంతుల్లో 5 రన్స్ మాత్రమే చేసిన సూర్యవంశీ.. మయాంక్ ఐదో ఓవర్లో సిక్సర్ల ఖాతా తెరిచాడు. ప్రిన్స్ యాదవ్‌ను 6,4,6తో శిక్షించి పవర్ ప్లేను 71/0తో ముగించాడు. ఏడో ఓవర్లో జైస్వాల్‌ను ఔట్ చేసిన ఆకాశ్ సింగ్ లక్నోకు బ్రేక్ ఇచ్చాడు. కానీ, ఈ ఆనందం ఎంతోసేపు నిలవలేదు. జురెల్ తోడుగా సూర్యవంశీ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వచ్చాడు. ఆకాశ్ వేసిన తొమ్మిదో ఓవర్లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 26 రన్స్ పిండుకున్నాడు.

23 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్న ఈ యంగ్ బ్యాటర్ తర్వాత మరింత భారీ షాట్లతో స్వేచ్ఛగా బ్యాటింగ్ చేశాడు. ప్రిన్స్ ఓవర్లో 6, 6 బాదాడు. ఇక, మయాంక్ బౌలింగ్‌లో ధ్రువ్ 4, 6, 6 కొడితే.. వైభవ్ రెండు సిక్సర్లు బాదడంతో ఏకంగా 29 రన్స్ లభించాయి. స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ బౌలింగ్‌లో 6, 4 కొట్టి 90ల్లోకి వచ్చిన వైభవ్ సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ, మోసిన్ వేసిన 14వ ఓవర్లో భారీ షాట్ ఆడబోయి సమద్‌కు క్యాచ్ ఇవ్వడంతో రెండో వికెట్‌కు 105 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికి 180/2తో నిలిచిన రాయల్స్ గెలుపు ఖాయం అయింది. వరుసగా 26 బంతుల్లో ఒక్క బౌండరీ ఇవ్వని లక్నో బౌలర్లు కాస్త ఒత్తిడి పెంచారు. ప్రిన్స్ బౌలింగ్‌లో సిక్స్‌తో జురెల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆఖరి ఓవర్ తొలి బంతికి డొనొవాన్ (16 నాటౌట్) విన్నింగ్ సిక్స్ కొట్టాడు.

**మార్ష్, ఇంగ్లిస్ మోత**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లక్నోకు ఓపెనర్లు మిచెల్ మార్ష్, జోష్ ఇంగ్లిస్ భారీ స్కోరు అందించారు. ఈ ద్వయం రాజస్థాన్ బౌలర్లపై ఆది నుంచి విరుచుకుపడింది. ఆర్చర్ ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే మార్ష్ వరుస బంతుల్లో ఫోర్, సిక్స్‌తో పరుగుల ఖాతా తెరిచాడు. మరో ఎండ్‌లో ఇంగ్లిస్ కూడా బ్యాటు ఝులిపించడంతో పవర్‌ప్లేలోనే 83 పరుగులు లభించాయి. ఈ జోడీని విడదీసేందుకు రాయల్స్ స్టాండిన్ కెప్టెన్ జైస్వాల్ బౌలింగ్ మార్పులు ఫలించ లేదు. ఈ క్రమంలో 23 బంతుల్లో ఇంగ్లిస్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. బ్రిజేష్ శర్మ 8వ ఓవర్‌లో ఆఖరి బంతికి మార్ష్ సిక్స్‌తో లక్నో 105 పరుగులకు చేరుకుంది.

అయితే యశ్‌రాజ్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన ఇంగ్లిస్..క్లీన్‌బౌల్డ్ కావడంతో తొలి వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఇంగ్లిస్ స్థానంలో క్రీజులోకి వచ్చిన పూరన్ (16).. మార్ష్‌కు జతకలిశాడు. ఈ దశలో పరుగుల రాక ఒకింత మందగించినా..షనక బౌలింగ్‌లో ఫోర్‌తో మార్ష్ 25 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. పూరన్ ఔటైన తర్వాత వచ్చిన పంత్ (35) నెమ్మదిగా ఆడటంతో లక్నోకు పరుగుల రాక కష్టమైనా..మార్ష్ తన జోరు కొనసాగించాడు. ఒక దశలో 250 పరుగులు సాధిస్తుందనుకున్న లక్నో ఆఖరి ఓవర్లలో ఘోరంగా తడబడి 220 స్కోరుకు పరిమితమైంది.

3 లీగ్‌లో సూర్యవంశీ 10 అంతకంటే ఎక్కువ సిక్సర్లు కొట్టడం ఇది మూడోసారి. క్రిస్ గేల్ అత్యధికంగా నాలుగు సార్లు ఈ ఘనత సాధించాడు.

53 ఈ సీజన్‌లో సూర్యవంశీ కొట్టిన సిక్సర్లు. ఒక అంచెలో రెండో అత్యధికం. క్రిస్ గేల్ 2012లో 59 సిక్సర్లు కొట్టి టాప్‌లో ఉన్నాడు.

**సంక్షిప్త స్కోర్లు**

లక్నో: 20 ఓవర్లలో 220/5(మార్ష్ 96, ఇంగ్లిస్ 60, యశ్‌రాజ్ 2/35, ఆర్చర్ 1/39);

రాజస్థాన్: 19.1 ఓవర్లలో 225/3 (సూర్యవంశీ 93, జురెల్ 53లి, ఆకాశ్ సింగ్ 1/54).

## స్పోర్ట్స్

## పంత్‌పై వేటు.. కుర్రాళ్లకు పిలుపు

**టెస్టు వైస్ కెప్టెన్సీతోపాటు వన్డే టీమ్ నుంచి రిషబ్ ఔట్**

**ఆఫ్ఘానిస్థాన్‌తో టెస్టు, వన్డే సిరీస్‌కు జట్ల ప్రకటన**

**సుతార్, గుర్నూర్, ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబేకు చాన్స్**



గువాహతి: ఫామ్ కోల్పోయి ఇబ్బంది పడుతున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ భారత వన్డే జట్టు నుంచి ఉద్వాసనకు గురయ్యాడు. టెస్టు జట్టు వెస్ కెప్టెన్సీ కూడా కోల్పోయాడు. ఐపీఎల్ ముగిసిన వెంటనే వచ్చే నెలలోఆఫ్ఘానిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌కు సీనియర్ సెలెక్షన్ కమిటీ మంగళవారం వేర్వేరు జట్లను ప్రకటించింది. గిల్ కెప్టెన్సీలోని ఇరు జట్లలో నలుగురు కొత్త ఆటగాళ్లకు చోటు ఇచ్చిన కమిటీ కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ నుంచి పంత్‌ను తప్పించి ఆ బాధ్యతలను కేఎల్ రాహుల్‌కు అప్పగించింది. ఇకపై టెస్టుల్లో పంత్ కేవలం కీపర్, బ్యాటర్‌గానే ఉంటాడు. వన్డే జట్టులో తను పూర్తిగా చోటు కోల్పోయాడు. వన్డేల్లో రాహుల్‌తో పాటు రెండో కీపర్‌గా ఇషాన్ కిషన్ పునరాగమనం చేశాడు. పంత్ వైట్ బాల్ క్రికెట్ ప్రణాళికల్లో ప్రస్తుతానికి లేడనే విషయాన్ని అగార్కర్ పరోక్షంగా స్పష్టం చేస్తూ.. అతను టెస్టుల్లో అత్యుత్తమ ప్రదర్శన చేయడంపైనే దృష్టి పెట్టాలని తాము భావిస్తున్నట్లు పేర్కొన్నాడు.స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు టెస్టుతో పాటు వన్డే సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు. రాబోయే ఇంగ్లండ్ టూర్ నేపథ్యంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు రెస్ట్ ఇచ్చినట్టు చీఫ్ సెలెక్టర్ అగార్కర్ తెలిపాడు.

**యువ స్పిన్నర్లపై మొగ్గు..**

భవిష్యత్తు అవసరాలను, 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకొని సెలెక్టర్లు స్పిన్ విభాగంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు టెస్టు మ్యాచ్‌కు విశ్రాంతినిచ్చినట్లు స్పష్టం చేసిన అగార్కర్.. మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌ను రెండు జట్ల నుంచి తప్పించాడు. బంతిని టర్న్ చేయడంలో అక్షర్ విఫలమవడం, బ్యాటింగ్ ఫామ్ క్షీణించడమే దీనికి కారణమని తెలుస్తోంది. జడ్డూ, అక్షర్ స్థానాల్లో యువ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ ద్వయం మానవ్ సుతార్, హర్ష్ దూబేను టెస్ట్ జట్టులోకి తీసుకున్నారు. దూబే వన్డే జట్టులోనూ చోటు సంపాదించాడు. అలాగే, ఈ రంజీ సీజన్లో కేవలం రెండు మ్యాచ్‌లు మాత్రమే ఆడిన 6.6 అడుగుల పంజాబ్ యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు రెండు జట్లలో అవకాశం కల్పించారు. ఐపీఎల్‌లో ఆకట్టుకుంటున్న లకో యంగ్ పేసర్ ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోకి వచ్చాడు. ముల్లన్‌పూర్ వేదికగా జూన్ 6న టెస్టు మ్యాచ్ జరగనుండగా.. అదే నెల 13, 17, 20వ తేదీల్లో వరుసగా ధర్మశాల, లక్నో, చెన్నైలో మూడు వన్డేలు షెడ్యూల్ చేశారు. కేవలం వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడుతున్న లెజెండరీ క్రికెటర్లు రోహిత్ వర్మ, విరాట్ కోహ్లిని వన్డే సిరీస్‌కు ఎంపికయ్యారు. అయితే రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుందని సెలెక్టర్లు తెలిపారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com